ఆదివారం
20-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 148
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సత్సంబంధాలకు కృషిచేద్దాం

2 లో

సుస్థిరాభివృద్ధి కోసం తమ మధ్య దౌత్య బంధాన్ని మెరుగుపర్చుకుందామని, మనస్పర్థలను మరిచి పరస్పరం అవగాహన పెంచుకునే దిశగా ముందుకు సాగుదామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ నిర్ణయించారు.

రొయ్యో... మొర్రో!

పెరిగిన ఉత్పత్తి వ్యయం...

తగ్గిన అమ్మకం ధరలు

- వంద కౌంట్ కిలో రూ.200 లోపే
- పాలకుల నిర్లక్ష్యంతో ఆక్వా రంగం కుదేలు
- ఆదుకోకుంటే క్రాప్ హాలిడే తప్పదంటున్న రైతులు

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో పడింది. ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రస్థానంలో ఉన్న ఏపీ...పాలకుల నిర్లక్ష్యంతో కుదేలైంది. ఒకపక్క ఉత్పత్తి ధరలు విపరీతంగా పెరగడం, మరోపక్క అమ్మకం ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు అతలాకుతలమవుతున్నారు. విదేశీమారకద్రవ్యం ఆర్జనలో మన ఆక్వా రంగానిదే అగ్రస్థానం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని తెచ్చిపెడుతూ...ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఆక్వారంగం సంక్షోభంలో పడటం ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం. అయినా పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆక్వా హాలిడే వైపు మొగ్గు చూపే పరిస్థితి దాపురిస్తోంది. నాలుగేళ్ల క్రితం ఇదే పరిస్థితి తలెత్తితే విద్యుత్ చార్జీలు తగ్గించడం, ఎగుమతిదారులతో సంప్రదింపులు జరపడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం ఆదుకుంది. మరలా అటువంటి చర్యలు చేపడితే తప్ప ఉత్పత్తి చేపట్టలేమని రైతులు చెబుతున్నారు. 100 కౌంట్ కిలో రొయ్య ఉత్పత్తికి రూ.270 ఖర్చు అవుతుండగా... ప్రభుత్వ మద్దతు ధర రూ.210గా ఉంది. ఆ ధరకు కూడా మార్కెట్‌లో అమ్మకాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంతో పోలిస్తే రొయ్యల సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. మార్కెట్‌లో ధరలు పడిపోవడం వల్ల కిలో రూ.80 వరకు నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రెండు హెచ్‌పీ మోటారుపై రూ.6వేలు, కేబుల్ ధర మీటరుపై రూ.30, ఏరియేటర్స్‌పై రూ.8వేల చొప్పున పెరిగాయి. సోయా ధరలు ఈ ఏడాదే మూడుసార్లు పెరిగి కిలో రూ.80 నుంచి రూ.108కి చేరింది. ఫలితంగా విద్యుత్ రూపంలోనే కిలో రొయ్య ఉత్పత్తికి 40 రూపాయల వరకు ఖర్చవుతోంది. దాణా ధరలు 35శాతం పెరగ్గా, ఇతర ఖర్చులు 60శాతం పైగా పెరిగాయి. రొయ్యలకి వ్యాధులు సోకకుండా వాడే మందుల ధరలు సైతం

- మిగతా 2 లో

రైతు మెడపై
జీఎస్టీ కత్తి

- సూక్ష్మసాగు పరికరాలపై కేంద్రం పన్నుల భారం
- డ్రిప్ పరికరాలపై 12 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సిందే

న్యూఢిల్లీ :
కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులపై కూడా ఆర్థిక భారాలు వేసేందుకు పూనుకుంది. అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో ఇప్పటికే దేశంలో ఆర్థిక విధ్వంసం సృష్టించింది. ఇప్పుడు అన్నదాతలపై జీఎస్‌టీ కత్తి పెట్టింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సాగులో నష్టాలను చవిచూస్తున్న రైతులు తమపై కేంద్రం విధిస్తున్న ఆర్థిక భారంతో ఆందోళన చెందుతున్నారు. తమ పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభించక అల్లాడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నా కేంద్ర పాలకులు వారిపై ఏమాత్రం కనికరం చూపడం లేదు. వ్యవసాయ రంగాన్ని ఛిద్రం చేసే చర్యలకు ఉపక్రమించారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించి, వారి ఆదాయాన్ని పెంచి, తద్వారా వచ్చే పన్నులతో ఖజానా నింపుకోవడం ప్రజా ప్రభుత్వాల లక్షణం. అయితే అభివృద్ధిని గాలికొదిలేసి, ప్రజలను పీల్చి పిప్పిచేస్తూ... అడ్డగోలుగా పన్నులు వేస్తూ వాటిని

- మిగతా 2 లో



పోరాటం తప్పదు

- వైసీపీని గద్దె దింపి రాష్ట్రాన్ని కాపాడాలి
- సంక్షేమం పేరుతో నిలువు దోపిడీ
- 27 దళిత పథకాలను రద్దు చేశారు: చంద్రబాబు

3 లో

గజ... గజ...

గణనీయంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

అరకులో ఉదయం 10 వరకు కానరాని ఎండ

విశాలాంధ్ర-అరకులోయ:
రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కూడా వాతావరణ పరిస్థితిపై తీవ్రంగా ఉండడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు గజగజ వణుకుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలకన్నా అనేక ప్రాంతాలలో తక్కువ ఉష్ణోగ్రత నమోదవుతోంది. పగటి ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి.

ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయను చలి వణికిస్తోంది. నవంబర్ మొదటి వారంలోనే అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతాల్లో చలి పులి పంజా విసిరింది. నవంబర్‌లో 8 నుంచి 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా అరకులో నవంబర్ రెండో వారం నుంచి 6 నుంచి 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో స్థానికులు, పర్యాటకులు వణికిపోతున్నారు. అరకులోయలో నెలకొన్న దట్టమైన అడవులు, పొగమంచు పర్యాటకులను పరవశింపజేస్తోంది. ఉదయం 10 గంటల వరకు ఎండ కనిపించడం లేదు. వణికించే చలిలో, దట్టమైన పొగ మంచు మధ్య సందర్శకులు ఆహ్లాదంగా, ఆనందంగా గడుపుతూ ప్రకృతి ఆస్వాదిస్తున్నారు. సుందరమైన వలిసెపూల సొగసుల మధ్య ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు తాము బస చేసిన అతిథి గృహాల వద్ద చలి మంటలు వేసుకొని నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. అరకులోయ అందాలను నవంబర్, డిసెంబర్ నెలలోనే చూడాలని, ఇక్కడ ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలు తమను ఎంతగానో

- మిగతా 2 లో

'గగన్‌యాన్' పారాచూట్ ఎయిర్‌డ్రాప్ సక్సెస్

ఇస్రో

బెంగళూరు:
భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మానవసహిత గగన్‌యాన్ క్షిపణి ప్రయోగంలో మరో మైలురాయి నమోదైంది. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) తాజాగా ఇంటిగ్రేటెడ్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ (ఐమాట్)ను విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రం నుంచి నిర్వహించింది. గగన్‌యాన్‌లోని వేగాన్ని అదుపు చేసే వ్యవస్థలో మూడు ప్రధాన పారాచూట్లతో పాటు చిన్న ఏసీఎస్, పైలట్, డ్రోగ్ పారాచూట్లు ఉంటాయని, కిందకు దిగేటప్పుడు వ్యోమగాముల రక్షణకు వినియోగమవుతాయని అంతరిక్ష కేంద్రం ప్రకటన వెల్లడించింది. వ్యోమగాములను భూమిపైకి సురక్షితంగా దించేందుకు మూడింటిలో నుంచి రెండు

- మిగతా 2 లో

అమరావతి ధ్వంసానికి కుట్ర

- ప్రాంతాల మధ్య జగన్ చిచ్చు
- తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రామకృష్ణ

విశాలాంధ్ర-తాడికొండ:
అమరావతి రాజధానిని ధ్వంసం చేసేందుకు జగన్ సర్కారు కుట్ర పన్నుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. తుళ్లూరులో రైతుల దీక్షా శిబిరాన్ని రామకృష్ణ శనివారం సందర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రైతులు రాజధాని నిర్మాణానికి 35 వేల ఎకరాల భూమి ఇచ్చారని, టీడీపీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లతో అనేక నిర్మాణాలు చేపట్టిందని రామకృష్ణ గుర్తుచేశారు. అమరావతి రాజధాని నిర్మాణంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధపు, మోసపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖలోనే రాజధాని కొనసాగుతుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతులను జగన్ సర్కారు అణచివేస్తోందని, కేసులు బనాయిస్తున్నదని ఆరోపించారు. దౌర్జన్యాలకు, కేసులకు సీపీఐ భయపడదని స్పష్టం చేశారు. కర్నూలులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తే వైసీపీ నాయకులు అడ్డు తగలటం ఏమిటని ప్రశ్నించారు. ఇది మంచి సంస్కృతి కాదని హితవు పలికారు. కర్నూలులో హైకోర్టు పెడతామంటే ఎవరైనా అడ్డు తగిలారా అని నిలదీశారు. ఉద్దేశపూర్వకంగా ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం ఇంతగా దిగజారటం సరికాదన్నారు. కడపలో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటే సీపీఐ అడ్డుతగులుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాజధానిలో టిడ్కో ఇళ్లు ఇస్తామంటే అడ్డుతగిలామా అని ప్రశ్నించారు.

విశాఖ సభలో ప్రధాని మోదీ అమరావతిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం హాస్యాస్పదమన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అమరావతిని కాపాడుకుంటామని, రైతుల పోరాటానికి సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని ఇంటికి సాగనంపాలన్నారు. దేశంలో 1068 రోజులపాటు దీక్షలు ఎక్కడా జరగలేదని గుర్తుచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ నాయకులు పచ్చల సాంబశివరావు, ముప్పాళ్ల శివశంకర్‌రావు, జీవీ రాజు, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, గుంటుపల్లి వెంకటేశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, షేక్ నాగుల్ మీరా, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాల మరియదాసు, అమరావతి జేఏసీ నాయకులు కాటా అప్పారావు, సత్యనారాయణ, చిలకా బసవరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి

టిడ్కో ఇళ్లను సత్వరమే పూర్తిచేసి... లబ్ధిదారులకు ఇవ్వాలని రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుళ్లూరులో నిర్మించిన టిడ్కో ఇళ్లను సీపీఐ నేతలు శనివారం పరిశీలించారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏంటీ తన్నినా, తిట్టినా ముప్పైఏళ్ళు నిన్నే భరించాలా? నీకేమైనా పిచ్చా!?

నగరాలు చితికిపోయాయి!

- దిల్లీ, మహారాష్ట్ర మినహా మిగతా రాష్ట్రాల్లో చాలా తక్కువ
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఒక శాతం రాబడి కూడా లేని వైనం
- పౌరులకు నాణ్యమైన మౌలిక వసతులు... సేవల పంపిణీలో విఫలం
- ఆర్‌బీఐ నివేదిక వెల్లడి

దేశంలో మున్సిపల్ కార్పొరేషన్ల రాబడి స్వల్పమే

2 లో

'నష్టం-విధ్వంసం' ఒప్పందం ఓకే?

సీఓపీ27 చర్చలపై మాల్దీవుల మంత్రి అమినాథ్ షౌనా

షర్మల్ షేక్:
ఈజిప్టులోని షర్మల్ షేక్‌లో సీఓపీ27 సదస్సులో 'నష్టం-విధ్వంసం'పై ఒప్పందం దాదాపు కుదిరిందని, దీనిపై ఓటింగ్ జరగాల్సి ఉన్నదని మాల్దీవుల పర్యావరణ మంత్రి అమినాథ్ షౌనా వెల్లడించారు. కర్బన ఉద్గారాలకు కారకులైన సంపన్న దేశాల నుంచి బాధిత-పేద దేశాలకు పరిహారంపై ఏకాభిప్రాయం దాదాపు ఖరారైనట్లు అని అన్నారు. ఇదే అంశమై ప్రతిష్ఠంభన నెలకొనడంతో శుక్రవారంతో ముగియాల్సిన వాతావరణ సదస్సు శనివారం కూడా కొనసాగింది. 'నష్టం-విధ్వంసం' ఒప్పందంపైనే రెండు వారాల పాటు చర్చలు సాగాయి. ఒకరినొకరు లక్ష్యంగా చేసుకుంటూ పరస్పరం దూషించుకుంటూపోతే చర్చలు కొలిక్కిరావని అంతకుముందు ఐరిష్ పర్యావరణ మంత్రి ఈమన్ రైన్ తెలిపారు. అంతా కూర్చొని చర్చించి నిర్ణయం తీసుకుంటేనే ఇది సాధ్యమవుతుందని చర్చల్లో కీలకంగా వ్యవహరించిన ఆయనన్నారు. అయితే, అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరినట్లు నష్టానికి విపత్తు నిధికి యూరోపియన్ యూనియన్ అంగీకరించింది. మిటిగేషన్ వర్క్ ప్రోగ్రామ్, గ్లోబల్ గోల్ ఆన్ అడాప్‌టేషన్ అండ్ క్లైమేట్ ఫైనాన్స్ వంటి అనేక కీలకాంశాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న దేశాలకు మాత్రమే నిధి సమకూర్చేందుకు అనుకూలంగా స్పందించారు. దీంతో జీ77 బ్లాక్‌లో భాగంగా ఉన్న భారత్, పాకిస్థాన్‌ను సభ మినహాయించింది. ఉద్గారాలకు ప్రధానంగా కారణమైన చైనాతో పాటు భారతదేశం కూడా ఈ నిధికి సహకరించాల్సి ఉంటుందన్న

- మిగతా 2 లో

సత్సంబంధాలకు కృషిచేద్దాం

సుస్థిరాభివృద్ధికి కట్టుబడదాం
కమలా హారిస్‌తో భేటీలో జిన్‌పింగ్

బ్యాంకాక్: సుస్థిరాభివృద్ధి కోసం తమ మధ్య దౌత్య బంధాన్ని మెరుగుపర్చుకుందామని, మనస్పర్థలను మరిచి పరస్పరం అవగాహన పెంచుకునే దిశగా ముందుకు సాగుదామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ నిర్ణయించారు. శనివారం ఇద్దరూ భేటీ అయి రెండు దేశాల సంబంధాలపై చర్చించారు. ఈ దిశగా కమలా హారిస్ కీలక పాత్ర పోషిస్తారని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో బాలీతో తన సమావేశం వ్యూహాత్మకంగా నిర్మాణాత్మకంగా జరిగిందని, చైనా-అమెరికా సంబంధాలను ముందుకు తీసుకుకెళ్లేందుకు కీలకమని జిన్‌పింగ్ అన్నారు. ఇద్దరు దేశాధినేతల భేటీ ఫలప్రదంగా సాగిందని హారిస్ వెల్లడించారు. చైనాతో ఘర్షణపై అమెరికా వివరణ కోరడం లేదని, అంతర్జాతీయ సమస్యలపై కలిసి పనిచేయాలని భావిస్తోందని, పరస్పరం సంప్రదింపులను ఆకాంక్షిస్తోందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్యపరంగా వాషింగ్టన్, బీజింగ్‌కు మధ్య సంబంధాలు చెడినట్లు గుర్తుచేశారు. తైవాన్, హాంకాంగ్, కోవిడ్ మహమ్మారి, మానవహక్కులు తదితర అంశాలపై భేదాభిప్రాయాలు ఉండటాన్ని ప్రస్తావించారు.

అమెరికాకు అపెక్ అధ్యక్షత: అమెరికాకు అపెక్ చైర్మన్‌షిప్‌ను అందజేసే కార్యక్రమంలో కమలా హారిస్ పాల్గొన్నారు. సుస్థిర ఆర్థికవృద్ధి కోసం అపెక్‌పై అమెరికా దృష్టిని కేంద్రీకరిస్తుందని ప్రపంచ నేతలకు హామీనిచ్చారు. వచ్చే ఏడాది ఈ గ్రూపు సమావేశాలను అమెరికా నిర్వహించనుంది. ఇందుకోసం కాలిఫోర్నియా కంటే అనువైన ప్రాంతం మరొకటి లేదని హారిస్ నొక్కిచెప్పారు. కాలిఫోర్నియాను ఆర్థిక నూతన అవిష్కరణలకు కేంద్రంగా వ్యవహరిస్తారని తెలిపారు. ఇండో-పసిఫిక్‌కు అమెరికా కట్టుబడి ఉంటుందన్నారు.

ఐరాస భద్రతా మండలి చర్చల్లో కశ్మీర్ ప్రస్తావన

పాక్ తీరుపై భారత్ ఆగ్రహం- అంతర్జాతీయ ఖండనకు పిలుపు

ఐరాస: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణల అంశంపై ప్లీనరీ సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని పాకిస్తాన్ లేవనెత్తింది. దీంతో దాయాది దేశంపై భారత్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇస్లామాబాద్ అసత్యాలను ప్రచారం చేయడానికి, బహుపాక్షిక సదస్సు వేదిక అయిందని ఎద్దేవా చేసింది. పాకిస్తాన్ తీరును అంతర్జాతీయ సమాజం వ్యతిరేకించాలని కోరింది. భారతదేశ శాశ్వత ప్రతినిధి ప్రతీక్ మాథుర్ మాట్లాడుతూ ఈ సభను పాకిస్తాన్ దుర్వినియోగిస్తుండటంతో దీనిపై ప్రతి స్పందనకుగాను 'స్పందించే హక్కు' (రైట్ ఆఫ్ రిప్లై)ను భారత్ వినియోగిస్తోందని అన్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణలకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంపై చర్చించడానికి మనమంతా సమావేశమైతే పాకిస్తాన్ ప్రతినిధి మాత్రం జమ్మూకశ్మీర్‌పై అనవసర వ్యాఖ్యలు చేశారన్నారు. పాకిస్తాన్ కోసం మరోసారి జమ్మూకాశ్మీర్ విషయంలో స్పష్టత ఇస్తానని ప్రతీక్ మాథుర్ చెప్పారు. పాకిస్తాన్ ప్రతినిధి విశ్వసించే లేదా ఆశించే దానితో సంబంధం లేకుండా భారతదేశంలో అంతర్భాగంగా, విడదీయరాని భాగంగా జమ్మూకాశ్మీర్ ఉందన్నారు. ఇప్పటికే దేశాన్ని అభివృద్ధి చేసుకోలేక ఉగ్రవాదుల చేతుల్లో పెడుతున్న పాక్ పాలకులు... జమ్మూకశ్మీర్‌పై కన్నేయడం కుట్రపూరితమని, దీనిని భారత్ తీవ్రంగా ఖండిస్తోందని మాథుర్ అన్నారు.

ఎయిర్‌డ్రాప్ సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)
ప్రధాన పారాచూట్లు చాలని, మూడవని అవసరానికి ఉంటుందని తెలిపింది. పరీక్ష సమయంలో ఒక ప్రధాన పారాచూట్ తొలుత తెరుచుకోలేదని వెల్లడించింది. క్రూ మాడ్యూల్ మాస్‌కు సమాన బరువు ఉండే ఐదు టన్నుల డమ్మీని ఐఏఎఫ్ ఐఎల్-76 ఎయిర్‌క్రాఫ్ట్ సాయంతో 2.5కిమీల ఎత్తు నుంచి కిందకు వదలగా రెండు చిన్న మర్టార్ పైలట్ పారాచూట్ల సాయంతో ప్రధాన పారాచూట్లు తెరుచుకున్నాయని పేర్కొంది. ఇందుకు ఏడు సెకన్లు పట్టిందని తెలిపింది. దశలవారీగా ప్రక్రియ 2-3 నిమిషాలు సాగిందని, శాస్త్రవేత్తలంతా ఊపిరి బిగబట్టి దీనిని వీక్షించారని, పేలోడ్ మాస్ సురక్షితంగా కిందకు దిగి, భారీ పారాచూట్లు కూలిన వెంటనే కేరింతలు, కరతాళధ్వనులు వినిపించాయని ప్రకటన తెలిపింది. ఈ పారాచూట్ల వేగాన్ని నియంత్రించే వ్యవస్థను డీఆర్‌డీఓ, ఇస్రో సంయుక్తంగా చేపట్టాయి. కీలకమైన ఈ పరీక్షను ఇస్రో, డీఆర్‌డీఓ సీనియర్ శాస్త్రవేత్తలతో పాటు వైమానిక దళాధికారులు వీక్షించారు. ఇస్రో, డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల సామర్థ్యంతో పాటు దేశంలోనే కీలక సంస్థలైన ఇస్రో, డీఆర్‌డీఓ, ఐఏఎఫ్, ఆర్మీకి మధ్య సయోధ్యకూ ఈ పరీక్ష అద్దంపట్టిందని ఇస్రో సీనియర్ అధికారి వెల్లడించినట్లు అంతరిక్ష కేంద్రం పేర్కొంది.

'నష్టం-విధ్వంసం' ఒప్పందం ఓకే?

(మొదటిపేజీ తరువాయి)
అంచనా ఉన్నది. యూరోపియన్ కమిషన్ ఉపాధ్యక్షుడు ఫ్రాన్స్ టిమ్మర్‌మాన్స్ మాట్లాడుతూ, 2022లో దేశాల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలిగానీ 1992లో పరిస్థితులను కాదని అన్నారు. నష్టానికిగాను నిధిని అడగడానికి భారతదేశం సంఘీభావం తెలిపిందని న్యాయం, అంతర్జాతీయ సంబంధాలు, భారతీయులను అధ్యయనం చేసే టఫ్ట్స్ విశ్వవిద్యాలయంలోని ఫ్లెచర్ స్కూల్ జూనియర్ రీసెర్చ్ ఫెలో తరుణ్ గోపాలకృష్ణన్ తెలిపారు. అమెరికా, బ్రిటన్ సహా కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణ మార్పులకు ముఖ్యంగా హాని కలిగించేవి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం చేయడానికి నిధులపై ముసాయిదా ప్రతిపాదనను విడుదల చేశాయని రాయిటర్స్ నివేదించింది. సీఓపీ 27 ఫలితాలపై తుది నిర్ణయం జీ77 దేశాలు ఒత్తిడి చేస్తున్న 'విపత్తు' నిధిపై ఒప్పందం తుది భేటీలో జరిగినట్లు తెలుస్తోంది. కాగా, సంస్కరణాత్మక వాతావరణ చర్యను ప్రోత్సహించడంలో యువత పాత్ర, డిజిటల్ ఆవిష్కరణలతో సహా ఎన్జీవో, కంట్రీ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లు, పెవిలియన్ ఈవెంట్లు, ఇండియన్ పెవీలియన్ శుక్రవారమే ముగిశాయి.

బకాయి ఎప్పుడు చెల్లిసారు? : ప్రపంచ నేతలను నిలదీసిన పదేళ్ల బ్రమణి
ఘనాకు చెందిన పదేళ్ల నకీయత్ బ్రమణి ప్రపంచ నేతల నుంచి స్టాండింగ్ ఒవేషన్ (అంతా నిలుచొని చప్పట్లతో అభినందించడం) అందుకున్నది. ప్లీనరీలో ఆమె చేసిన ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ బాధ్యతల నుంచి తప్పుకోవద్దని ప్రపంచ నేతలకు బ్రమణి సూచించింది. వాతావరణ మార్పు వల్ల కలిగిన నష్టానికిగాను మూల్యం చెల్లించడంతో పాటు అనేక కీలక అంశాల్లో పటిష్ఠ నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'ప్రియమైన సీఓపీ ప్రజలారా... మనస్సు పెట్టి ఆలోచించండి.. లెక్కలు వేయండి.. ఇది అత్యవసర పరిస్థితి' అంటూ ప్రపంచ నాయకులకు అభ్యర్థించింది.
వాతావరణ పీడిత 58 దేశాల ఫోరం యువ రాయబారిగా నకీయత్ బ్రమణి సీఓపీ27 ప్లీనరీలో ప్రపంచ నేతలను మందలించింది. 'చాలా కాలంగా బకాయి పడ్డారు... ఎప్పుడు చెల్లిసారు? అని ప్రశ్నించింది. 'మీరు మీ ధైర్యాన్ని చూపండి... మాకు హీరోలుగా నిలవండి' అని సూచించింది. 'మీరు సంపన్నులు లేక శక్తిమంతులైతే అవసరార్థులకు నిధులు సమకూర్చి ఆదుకోవాలి. మన వర్గాలను నిస్సహాయులుగా వదిలేయొద్దు. సీఓపీలు నిర్వహిస్తూ జేబులకు చిల్లు వేయొద్దు.. బాధ్యతాయుతంగా వ్యవహరించండి. మీరు ముసలివారవుతున్నారు... ఇప్పటికే మీ వయస్సు మళ్లింది. త్వరగా నిర్ణయం తీసుకోండి. బకాయి ఎప్పుడు చెల్లిస్తారో చెప్పండి' అని ప్రపంచ నేతలను బ్రమణి నిలదీసింది. భావితరాలకు పర్యావరణ అంశాలపై అవగాహన కల్పించేందుకు తన వంతు కృషిచేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే పర్యావరణంపై పుస్తకం రాసినట్లు చెప్పింది. ఘనాలో ప్రతి పిల్లాడు చెట్లు/మొక్కలు నాటే లక్ష్యంతో 'ట్రీస్ ఫర్ లైఫ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ప్రపంచ నేతలకు నకీయత్ బ్రమణి వెల్లడించింది.

అమరావతి ధ్వంసానికి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)
పేదల కోసం టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మించిందన్నారు. టిడ్కో ఇళ్లకు మంచినీరు, కరెంటు, రహదారి సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసీపీ ప్రభుత్వం 33 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్లు చెప్పుకుంటుందని, కానీ ఇళ్ల నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారిందని రామకృష్ణ విమర్శించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్ల పంపిణీ కోసం డిసెంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా టిడ్కో ఇళ్ల పంపిణీకి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు.

గజ...గజ...

(మొదటిపేజీ తరువాయి)
ఆకట్టుకుంటున్నాయని పర్యాటకులు చెబుతున్నారు. అరకు సహజ సిద్ధ అందాల మధ్య సినిమా షూటింగ్‌లు, టీవీ సీరియళ్లు కూడా జోరుగా జరుగుతున్నాయి. ఈ నెలలో అరకులోయ అందాలను వీక్షించడానికి వస్తున్న పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇటువంటి అద్భుతమైన వాతావరణంలో కొద్దిరోజులు గడిపేందుకు వివిధ ప్రాంతాల పర్యాటకులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. దీనివల్ల రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సందర్శకులు అరకు లోయ వైపు చూస్తున్నారు. అరకు లోయ అంటే అద్భుత అందాలకు నిలయమని భూతల స్వర్గానికి కేంద్రమని సందర్శకులు గొప్పగా చెప్పుకుంటున్నారు.

రైతు మెడపై జీఎస్టీ కత్తి

(మొదటిపేజీ తరువాయి)
ముక్కుపిండి వసూలు చేసుకోవడం మోదీ విధానం. జీఎస్టీ పేరుతో పేదోడి నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం... చివరికి దేశానికి అన్నం పెట్టే అన్నదాతను సైతం వదలడం లేదు. సూక్ష్మ సేద్యానికి ఉపయోగించే పరికరాలపై కేంద్రం 12 శాతం జీఎస్టీ విధిస్తున్నది. దీంతో సూక్ష్మ సేద్యం చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. సూక్ష్మం సేద్యం చేయాలన్న ఆసక్తితో చాలామంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ జీఎస్టీ భారం ఉందని తెలియడంతో వెనుకడుగు వేస్తున్నారు.

రైతులు సాగుకు వెనుకడుగు
సూక్ష్మ వ్యవసాయం ఎంతో వ్యయంతో కూడుకున్నది. ఎకరం స్థలంలో సూక్ష్మ సేద్యం చేయాలంటే దాదాపు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతున్నది. దీనిపై కేంద్రానికి 12 శాతం జీఎస్టీ చెల్లించాలి. నాలుగెకరాలున్న రైతు సూక్ష్మ సేద్యం కోసం జీఎస్టీ రూపంలో రూ.12 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో చాలామంది రైతులు సూక్ష్మసేద్యం పట్ల నిరాసక్తత కనబరుస్తున్నారు.

నెదర్లాండ్స్ కమ్యూనిస్టు పార్టీ 30వ వార్షికోత్సవం

ఆమ్‌స్టర్‌డామ్: న్యూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది నెదర్లాండ్స్ (నెదర్లాండ్స్ కమ్యూనిస్టు పార్టీ) (ఎన్‌సీపీఎన్) 30వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నది. 1992, నవంబరు 14న ఈ పార్టీ ఏర్పాటు అయింది. క్యూబా దౌత్యకార్యాలయంతో పాటు బెల్జియం, జర్మనీ, గ్రీస్, లక్సంబర్గ్, టర్కీ కమ్యూనిస్టు పార్టీలు శుభాకాంక్షలు తెలియజేశాయి. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులోనూ ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సౌహార్ద సందేశాలిచ్చారు. సంఘీభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని ప్రకటించారు. అనంతరం వేడుకలో పెద్ద సంఖ్యలో సభ్యులు, దేశవ్యాప్తంగా ఉన్న కామ్రేడ్‌లు పాల్గొన్నట్లు పార్టీ ప్రకటన పేర్కొంది. ఆటపాటలతో కోలాహలంగా వార్షికోత్సవం జరిగినట్లు తెలిపింది.

2023లో బీజింగ్‌లో మూడవ బీఆర్ఐ సదస్సు!

బీజింగ్: వచ్చే ఏడాదిలో అంతర్జాతీయ సహకారం కోసం మూడవ బెల్ట్ అండ్ రోడ్ ఫోరాన్ని బీజింగ్‌లో నిర్వహించే ఆలోచన ఉన్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. కోవిడ్ మహమ్మారి క్రమంలో రెండేళ్లుగా బీజింగ్ ఒలింపిక్స్ మినహా అంతర్జాతీయ కార్యక్రమాలు ఏవీ చైనా నిర్వహించడలేదు. కోవిడ్ విజృంభించడంతో బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) సదస్సు 2019 నుంచి నిర్వహించలేదు. అపెక్ సదస్సు క్రమంలో జిన్‌పింగ్ బీఆర్ఐ సదస్సు గురించి ప్రస్తావించారు.

నగరాలు చితికిపోయాయి!

న్యూఢిల్లీ: భారతీయ నగరాలు ఆర్థికంగా చితికిపోయాయి. దేశంలోని మునిసిపల్ కార్పొరేషన్లు తమ పౌరులకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు, సేవలను అందించడానికి అవసరమైన వనరులను ఉత్పత్తి చేయలేకపోతున్నాయి. దిల్లీ, మహారాష్ట్రల్లోని మున్సిపల్ కార్పొరేషన్ల మినహా మిగతా రాష్ట్రాల్లోని కార్పొరేషన్ల రెవెన్యూ రాబడి చాలా తక్కువగా ఉందని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తొలి నివేదిక వెల్లడించింది. భారతదేశ పట్టణ జనాభా 2011లో 37.7 కోట్ల నుంచి 2050 నాటికి 80 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అంటే చాలా నిధులు కావాలి. కానీ మునిసిపల్ ఆదాయాలు, వ్యయాలు ఒక దశాబ్దం పాటు జీడీపీలో దాదాపు 1 శాతం వద్ద నిలిచిపోయాయి. నేడు, మున్సిపాలిటీలు కేంద్రం, రాష్ట్రాల నుంచి గ్రాంట్లు, రుణాలు, ఆర్థిక సంస్థల నుంచి రుణాల పై ఆధారపడుతున్నాయి. ఇక పురపాలక సంఘాలకు సరైన ఆర్థిక ఆధారాన్ని ఉపయోగించుకోవడానికి రాజకీయ సంకల్పం అవసరం. మునిసిపల్ బాండ్లు (మునిస్) స్థిరమైన వనరుల సమీకరణకు విశ్వసనీయమైన ఎంపిక అని ఆర్‌బీఐ విశ్వసిస్తోంది. ఆర్‌బీఐ నివేదిక అన్ని రాష్ట్రాల్లోని 201 మునిసిపల్ కార్పొరేషన్‌ల (ఎంసీలు) కోసం బడ్జెట్ వివరాలను సమీకరించడం, విశ్లేషించడం చేసింది. భారతదేశంలో పట్టణీకరణ వేగవంతమైన వృద్ధి పట్టణ అవస్థాపనలో సంబంధిత పెరుగుదలతో కలిసి లేదు. ఇది పట్టణ స్థానిక సంస్థల పనితీరులో, ముఖ్యంగా మునిసిపల్ కార్పొరేషన్ల పనితీరులో ప్రతిబింబిస్తోంది. ఆర్థిక స్వయం ప్రతిపత్తి లేకపోవడం. స్థాపన ఖర్చులు, పరిపాలనా వ్యయాలు, వడ్డీ, ఆర్థిక చార్జీల రూపంలో మునిసిపాలిటీల నిబద్ధత వ్యయం పెరుగుతోంది. అయితే వీటికి మూలధన వ్యయం తక్కువగా ఉంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఒక శాతం కూడా మిగతా రాష్ట్రాల కార్పొరేషన్ల రెవెన్యూ రాబడిలేదని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ల రెవెన్యూ రాబడి ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.75 శాతం ఉండగా మహారాష్ట్రలోని మున్సిపల్ కార్పొరేషన్ల రెవెన్యూ రాబడి ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.12 శాతం ఉందని తెలిపింది. దేశంలోని వివిధ రాష్ట్రాల మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు, అందులో కార్పొరేషన్ల సొంత రాబడులు, వ్యయాలకు సంబంధించి ఆర్‌బీఐ అధ్యయనం చేసి నివేదిక విడుదల చేసింది. ఇందులో ముఖ్యాంశాలు ఏమిటంటే... పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా పట్టణ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి కార్పొరేషన్లు సొంత రాబడులను పెంచుకోవడంతో పాటు వివిధ మార్గాల్లో నిధులను సమీకరించుకోవాలి. దేశంలోని మున్సిపల్ కార్పొరేషన్ల సగటు ఆదాయాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో చాలా తక్కువ రాబడి ఉంది. దేశ జీడీపీలో కార్పొరేషన్ల సగటు రాబడి 0.72 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో అది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 0.38 శాతమే ఉంది. మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు, సొంత రెవెన్యూ రాబడులు అత్యధికంగా ఉండగా మిగతా రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు, సొంత రెవెన్యూ రాబడులు అత్యంత తక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్పొరేషన్ల సొంత రెవెన్యూ రాబడులు 2018-19 ఆర్థిక ఏడాదిలో రూ.2,906.83 కోట్లు ఉండగా... రెవెన్యూ వ్యయం రూ.2,692.52 కోట్లుగా ఉంది. అదే 2019-20లో సొంత రెవెన్యూ రాబడులు రూ.2,906.83 కోట్లు ఉండగా రెవెన్యూ వ్యయం రూ.2,954.08 కోట్లు ఉంది.

అసమర్థతే అసలు కారణమా?

'చాలా మునిసిపాలిటీలు బడ్జెట్ ప్రణాళికలకు వ్యతిరేకంగా బడ్జెట్‌లు, వాస్తవాలను సమీక్షించడమే కాకుండా బ్యాలెన్స్ షీట్, నగదు ప్రవాహ నిర్వహణ కోసం వారి ఆడిట్ చేసిన ఆర్థిక నివేదికలను ఉపయోగించవు. ఫలితంగా గణనీయమైన అసమర్థతలకు దారి తీస్తుంది' అని నివేదిక పేర్కొంది. కాగా స్థానిక పాలనా వ్యవస్థను సంస్థాగతీకరించినప్పటికీ వాటి పనితీరులో గణనీయమైన మెరుగుదల లేదని పేర్కొంటూ మున్సిపల్ కార్పొరేషన్ల పనిలో అనేక లోపాలను ఎత్తిచూపింది. 'భారతదేశంలో పట్టణ జనాభాకు అవసరమైన సేవల లభ్యత, నాణ్యత తత్ఫలితంగా పేలవంగా ఉన్నాయి' అని వివరించింది. మునిసిపల్ కార్పొరేషన్లు తమ వనరులను పెంచుకోవడానికి వివిధ వినూత్న బాండ్లు, భూమి ఆధారిత ఆర్థిక యంత్రాంగాలను అన్వేషించాలని పేర్కొంది. పట్టణ జనాభా సాంద్రత వేగంగా పెరగడం, మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాల కోసం పిలుపునిస్తోంది. అందువల్ల స్థానిక ప్రభుత్వాలకు ఎక్కువ ఆర్థిక వనరులు అవసరం అని వెల్లడించింది. రాష్ట్ర ఆర్థిక కమిషన్‌లను (ఎస్‌ఎఫ్‌సీ) ప్రతి ఐదేళ్లకోసారి ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా, సకాలంలో ఏర్పాటు చేయడం లేదని ఆర్‌బీఐ పేర్కొంది. దీని ప్రకారం, చాలా రాష్ట్రాలలో్ స్థానిక ప్రభుత్వాలకు నిబంధనల ఆధారిత నిధుల పంపిణీని నిర్ధారించడంలో ఎస్‌ఎఫ్‌సీలు ప్రభావవంతంగా లేవని పేర్కొంది.

ఎస్ఎఫ్‌సీల ఏర్పాటులో జాప్యానికి అనేక కారణాలు ఉన్నాయి. ఎస్ఎఫ్‌సీలు తమ నివేదికలను సమర్పించడానికి సగటున 32 నెలల సమయం తీసుకుంటాయి. ఫలితంగా సగటున 16 నెలల ఆలస్యం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర శాసనసభలలో చర్య తీసుకున్న నివేదిక (ఏటీఆర్) ని సమర్పించడంలో గణనీయమైన సమయాన్ని తీసుకుంటాయని వివరించింది. భారతదేశంలో మునిసిపల్ ఆదాయాలు/వ్యయాలు దశాబ్ద కాలంగా జీడీపీలో 1 శాతం వద్ద నిలిచిపోయాయని, మునిసిపల్ ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు కేంద్రం, రాష్ట్రాలు తమ జీఎస్‌టీలో ఆరవ వంతును పంచుకోవచ్చని నివేదిక పేర్కొంది.

కాంగ్రెస్ నుంచి మర్రి శశిధర్ రెడ్డి బహిష్కరణ



విశాలాంధ్ర-హైదరాబాద్: మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డిపై కాంగ్రెస్ అధిష్టానం బహిష్కరణ వేటు వేసింది. పార్టీ నుంచి ఆయనను క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి బహిష్కరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ బహిష్కరణ వేటు వేశారు. అయితే శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నట్లు సమాచారం. బీజేపీ నేతలు బండి సంజయ్, డీకే అరుణతో కలిసి శుక్రవారం రాత్రి కేంద్రమంత్రి అమిత్‌షాతో శశిధర్‌రెడ్డి భేటీ అయ్యారు. పార్టీలో చేరే విషయంపై చర్చించినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. రెండు రోజులుగా దిల్లీలో ఉన్న ఆయన, అనేకమంది బీజేపీ నేతలతో సంప్రదింపులు జరిపారు. అయితే అమిత్‌షాతో భేటీ సందర్భంగా సంజయ్‌తో తెలంగాణ రాజకీయాలపై చర్చించినట్లు చెబుతున్నారు. రెండు రోజులుగా శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం జరిగింది. బండి సంజయ్ ఇతర నేతలో కలిసి ఆయన దిల్లీ వెళ్లారు. ఈ నేపథ్యంలోనే శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరడం ఖాయమని ప్రచారం జరిగింది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. తాను దిల్లీకి రావడం కొత్తేమీ కాదని, మనవడి స్కూల్ ఫంక్షన్‌లో పాల్గొనడానికి వచ్చానని తెలిపారు. "నేను ఇంకా రాజకీయాల్లోనే ఉన్నా. రిటైర్డ్ కాలేదు. నేను దిల్లీకి వచ్చిన విమానంలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. బీజేపీలో చేరడానికే నేను దిల్లీకి వచ్చానన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు"అని ప్రకటించడం గమనార్హం.

లోయలో పడిన కారు... ఐదుగురి మృతి

ఉత్తరకాశీ: ఉత్తరకాశీ జిల్లాలోని బ్రహ్మఖాల్ సమీపంలో శనివారం కారు లోతైన లోయలో పడిపోవడంతో ఐదుగురు వ్యక్తులు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ధారసు-యమునోత్రి జాతీయ రహదారిపై ఉదయం 11 గంటలకు ఉత్తరకాశీ నుంచి పురోలా వెళ్తున్న వాహనం 400 మీటర్ల లోతులో పడిపోవడంతో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, ఒక మహిళ తీవ్రంగా గాయపడినట్లు ధారసు ఎస్‌హెచ్‌ఓ రీతురాజ్ తెలిపారు. గాయపడిన మహిళను మొదట బ్రహ్మఖాల్‌లోని ఆసుపత్రికి తరలించారు, అక్కడ నుండి ఉత్తరకాశీ జిల్లా ఆసుపత్రికి తరలించారని, ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఆయన చెప్పారు. ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియనప్పటికీ, డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే వాహనం లోయలో పడిపోయిందని చెబుతున్నారు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం

అమిత్ షా

న్యూదిల్లీ : ఉగ్రవాదాన్ని ఏ దేశం ఒంటరిగా ఓడించలేదని, పెరుగుతున్న సంక్లిష్టమైన, సరిహద్దులేని ముప్పుపై అంతర్జాతీయ సమాజం భుజం భుజం కలిపి పోరాడాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా శనివారం అన్నారు. ఉగ్రవాద నిరోధక ఫైనాన్సింగ్‌పై 3వ 'నో మనీ ఫర్ టెర్రర్' మంత్రిత్వ శాఖల సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తూ, కొన్ని దేశాలు, వాటి సంస్థలు ఉగ్రవాదాన్ని తమ రాష్ట్ర విధానంగా మార్చుకున్నాయని అన్నారు. 'ఈ ఉగ్రవాద స్వర్గధామాల్లో ఆర్థిక అణిచివేతతో పాటు వారి అనియంత్రిత కార్యకలాపాలకు సంకెళ్లు వేయడం అవసరం. అన్ని దేశాలు తమ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాల కంటే ఎదగాలి' అని షా అన్నారు. కొన్ని దేశాలు ఉగ్రవాదులకు, ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే వారికి పదే పదే మద్దతిస్తున్నాయని అన్నారు. 'ఉగ్రవాదానికి అంతర్జాతీయ సరిహద్దులు లేవని, అందువల్ల అన్ని దేశాలు రాజకీయాలకు అతీతంగా ఆలోచించి పరస్పరం సహకరించుకోవాలని నేను విశ్వసిస్తున్నాను' అని అన్నారు. ఉగ్రవాదం 'సరిహద్దు లేని ముప్పు'ని ఓడించడానికి అంతర్జాతీయ సమాజం మధ్య గూఢచార భాగస్వామ్యంలో పారదర్శకత కోసం ఆయన పిలుపునిచ్చారు. 'మా మొదటి నిబద్ధత పారదర్శకతతో సహకరించడం. అన్ని దేశాలు, అన్ని సంస్థలు, మెరుగైన, మరింత ప్రభావవంతమైన పద్ధతిలో గూఢచారాన్ని పంచుకోవడంలో పూర్తి పారదర్శకతను ప్రతిజ్ఞ చేయాలి' అని తెలిపారు. యువతలో తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న సంస్థపై భారతదేశం తీసుకున్న చర్యను ఉటంకిస్తూ, ప్రతి దేశం అలాంటి సంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అన్నారు.

7 నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూదిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 7 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఈమేరకు లోక్‌సభ, రాజ్యసభ వేర్వేరు నోటిఫికేషన్లు జారీచేశాయి. కొత్త పార్లమెంటు భవనం ఇంకా నిర్మాణదశలో ఉన్నందున పాత భవనంలోనే సమావేశాలు జరుగుతాయని అధికార వర్గాలు వెల్లడించాయి. సమావేశాలను ప్రారంభించే ముందు ఉభయసభల సభాపతులు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి సభ సజావుగా సాగేలా సహకరించాలని కోరతారు.

మోడల్‌పై సామూహిక అత్యాచారం...

మహిళ సహా నలుగురి అరెస్ట్

కొచ్చి: కదులుతున్న కారులో 19 ఏళ్ల మోడల్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో ఒక మహిళతో సహా నలుగురిని కేరళ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాసర్‌గోడ్‌కు చెందిన బాలికపై కొడంగల్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ వాహనంలో గురువారం రాత్రి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని నగర పోలీసు కమిషనర్ సీహెచ్ నాగరాజు తెలిపారు. బాధితురాలికి తెలిసిన వ్యక్తి అయిన నిందితురాలు రాజస్థాన్‌కు చెందినదని, మోడల్‌గా పనిచేస్తోందని పేర్కొన్నారు. నలుగురు నిందితుల నేపథ్యాన్ని విచారిస్తున్నామని, త్వరలో కోర్టు ముందు హాజరుపరుస్తామని వివరించారు. స్థానిక మీడియాతో సమావేశమైన పోలీస్ కమిషనర్ ఈ ఘటనలో అక్రమ రవాణా అంశం కూడా ఉందని, ఆ దిశగా కూడా ఎఫ్‌ఐఆర్ జోడించినట్లు కమిషనర్ వివరించారు.

నగరంలోని కక్కనాడ్‌లో ఉంటున్న బాధితురాలిని ఆమె స్నేహితురాలు, రాజస్థానీ మహిళ డీజే పార్టీకి ఆహ్వానించి, పురుషులతో పరిచయం చేసుకున్నట్లు శుక్రవారం రాత్రి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తెలిపారు. నిందితులు మోడల్‌ను తమ వాహనంలో తీసుకెళ్లి బార్‌లో మద్యం తాగి గురువారం రాత్రి 'సామూహిక అత్యాచారం' చేశారని వివరించారు. "ఆమె గాయపడినట్లు వైద్య ఆధారాలు సూచిస్తున్నాయి. నేరం చేసిన తర్వాత, ఆ వ్యక్తులు బాధితురాలిని కక్కనాడ్‌లో పడేశారు" అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున బాధితురాలిని ఆమె రూమ్‌మేట్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

రొయ్యో... మొర్రో !

(మొదటిపేజీ తరువాయి)
మండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సడా) కింద నమోదు చేసుకున్న 10 ఎకరాల్లోపు చెరువులలో రొయ్యల పెంచే రైతులకే విద్యుత్ రాయితీ వర్తించేలా జారీ చేసిన జీవో కూడా ఆక్వా రంగం పాలిట శాపంగా మారింది. పది ఎకరాలు దాటిన ఆక్వా రైతులు, ఆక్వాజోన్ పరిధిలో లేని చెరువులు, కౌలుదారులు విద్యుత్ రాయితీ అందక... యూనిట్ ధర రూ.3.85 పడటంతో ఎకరాకు రూ.18వేలు అదనపు భారం పడుతోంది. ఇంకోవైపు నాలుగు నెలల క్రితం వరకు మార్కెట్‌లో 30 కౌంట్ రొయ్య కిలో రూ.600 ధర పలకగా, ప్రస్తుతం రూ.400కి కూడా కొనడం లేదు. అలాగే రూ.60 కౌంట్ రొయ్యల ధర రూ.400 నుంచి రూ.250కి పడిపోగా, 80 కౌంట్ రొయ్యల ధర రూ.320 నుంచి రూ.200కి పడిపోయింది. వీటికితోడు రొయ్యకు పెరుగుతున్న వ్యాధుల తీవ్రతను ఎదుర్కొనేందుకు వినియోగించే మందులకు అదనపు వ్యయమవుతోంది. ఇటువంటి దుస్థితిలో ఆక్వారంగం రైతులు తీవ్రనష్టాలతో అప్పుల పాలవుతున్నారు. రొయ్యల పెంపకంతో అప్పులు పాలయ్యే బదులు ఆక్వా హాలీడే వైపు మొగ్గు చూపడమే మంచిదనే నిర్ణయానికి వస్తున్నారు. ఈ పరిణామాలు ఆక్వా రంగంపై ఆధారపడి జీవించే లక్షలాది మందిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు విస్తీర్ణం ఉండగా, దీనిలో అత్యధికంగా ఉభయ గోదావరి జిల్లాల్లోనే 3.20 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆ తర్వాత కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో సాగు ఎక్కువగా ఉంది.

ఎగుమతులకు ప్రతిబంధకాలు

భారత్ నుంచి విదేశాలకు ఎగుమతయ్యే రొయ్యల్లో దాదాపు 40 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటాయి. మన ఉత్పత్తులు ఎక్కువగా చైనా, అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కరోనాతో దిగుమతులను చైనా గణనీయంగా తగ్గించుకోవడం, ఇండోనేసియా, ఈక్వెడార్ నుంచి అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతులు పెరగడం వంటి పరిణామాలు మన ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆక్వా రంగాన్ని ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఒంటెత్తు పోకడలతో కొత్త చట్టాలు తెచ్చి వేధింపులకు గురిచేయడం తగదని, ఇప్పటికైనా ఆదుకునే చర్యలు చేపట్టాలని రైతు నేతలు కోరుతున్నారు. ముఖ్యంగా ఎన్నికల సందర్భంగా సీఎం జగన్ చేసిన వాగ్దానం ప్రకారం ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్తును రూ.1.50 చొప్పున ఇవ్వాలని, నాణ్యమైన రొయ్య పిల్లలను సరఫరా చేయాలని, దాణా రేట్లు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, పెరిగిన ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి రొయ్యలకి మద్దతు ధర ప్రకటించడంతోపాటు ఎగుమతి ప్రోత్సాహకాలపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

మెయిన్‌పురిలో బీజేపీ, ఎస్పీ హోరాహోరీ

మెయిన్‌పురి(ఉత్తరప్రదేశ్): త్వరలో ఉప ఎన్నిక మెయిన్‌పురీ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ ఎస్పీ మధ్య పోటీ ఉండబోతోంది. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి డింపుల్ యాదవ్, బీజేపీకి అభ్యర్థి రఘురాజ్ సింగ్ సఖ్య మధ్య హోరాహోరీ జరగనున్నది. నామినేషన్‌లో స్క్రూటీన్‌లో 13 నామినేషన్లలో ఏడు నిరాకరణకు గురయ్యాయని శనివారం ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. నిరాకరణకు గురైన నామినేషన్లలో సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్పీ)కిచెందిన రమాకాంత్ కశ్యప్ కూడా ఉన్నట్టు అధికారులు వివరించారు. మెయిన్‌పురీ స్థానంలో సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములయాంసింగ్ యాదవ్ మృతి చెందడంతో మెయిన్‌పురీలో ఉప ఎన్నికల నిర్వహించాల్సి వచ్చింది. కశ్యప్‌తో సహా 13మంది అభ్యర్థులు నామినేషన్‌లు సమర్పించారు. నామినేషన్ ఉపసంహరణకు నవంబర్ 21 వరకూ సమయం ఉంది. ఈ స్థానంలో గెలిచి ఎస్పీ వ్యవస్థాపకుడిని ఘనమైన నివాళి అర్పిద్దామని ఎస్పీ చూస్తోంది. ఇందుకోసం ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ బాబాయి, ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ (లోహియా) (పీఎస్‌పీఎల్) అధ్యక్షుడు శివపాల్ యాదవ్ సహాయం ఇప్పటికే కోరింది.

పంట రుణాలు మాఫీ చేయాలి

పి.రామచంద్రయ్య డిమాండ్

విశాలాంధ్ర– పత్తికొండ: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు తీసుకున్న అన్ని రకాల బ్యాంక్ రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. కర్నూల్ జిల్లాలోని పత్తికొండలోగల చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన ఏపీ రైతు సంఘం సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సరైన వర్షాలు కురవక, అక్టోబర్‌లో అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.పత్తి, వేరుశనగ, ఆముదం, టమోటా తదితర పంటలకు ఎకరాకు రూ.40వేల లెక్కన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనాకు కేంద్ర కరువు పరిశీలన బృందం జిల్లాలో పర్యటించాలని సూచించారు. ఇవే డిమాండ్లతో త్వరలోనే రైతు రక్షణ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కారన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి పెద్ద ఈరన్న, సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం నాయకులు పెద్దముని, హనుమప్ప, పంపావతి, సీపీఐ పందికోన శాఖ కార్యదర్శి జోహారాపురం కాశి పాల్గొన్నారు.

వేమూరులో రోశయ్య కాంస్య విగ్రహం

రూ.10 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య స్మృత్యర్థం బాపట్లలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రోశయ్య సొంత గ్రామమైన బాపట్ల నియోజకవర్గం వేమూరులో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీలోని ఆర్యవైశ్య నేతలు ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సాంస్కృతిక వ్యవహారాల శాఖ శనివారం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వేమూరులో రోశయ్య కాంశ్య లేదా ఇత్తడి విగ్రహ ఏర్పాటు కోసం రూ.10 లక్షలు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజత్ భార్గవ పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని సాంస్కృతిక శాఖ ఖాతా నుంచి విడుదల చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా వైశ్య వర్గానికి చెందిన ఒక వైసీపీ నేతను అధికారపార్టీ నేతలే నిర్బంధించి ఆయనపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో వైశ్య వర్గీయులు మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపధ్యంలో వైశ్య వర్గీయులను శాంతింపజేసే ప్రక్రియలో భాగంగానే రూ.10లక్షల నిధులు మంజూరు చేసి రోశయ్య విగ్రహం ఏర్పాటుకు జగన్ సర్కార్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

'శబరిమల' ప్రమాదంపై సీఎం ఆరా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: శబరిమల యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో యాత్రికుల బస్సు పతనంతిట్ట వద్ద ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సీఎంఓ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వారికి సరైన సహాయం అందించేలా చూడాలని ఆదేశించారు. గాయపడ్డవారికి మంచి వైద్యం అందించడమే కాకుండా, యాత్రికులకు తగిన సౌకర్యాలు కల్పించేలా చూడాలన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఏలూరు మండలం మాదేపల్లికి చెందిన భక్తుల బృందం మొత్తం 2 బస్సుల్లో 84 మంది శబరిమల వెళ్లారని, ఈ బస్సులు తిరిగి వస్తున్న సమయంలో ఈ ఉదయం 8:10 గంటలకు పతనంమిట్ట వద్ద ఒక బస్సు ప్రమాదానికి గురైందని తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సులో 44 మంది ప్రయాణిస్తున్నారని, 18 మంది గాయపడ్డారని, కొట్టాయం మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో నలుగురికి చికిత్స అందిస్తున్నామని, ఇందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. మిగిలిన వారంతా క్షేమంగా ఉన్నారని, వారికి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పతనంతిట్ట జిల్లా కలెక్టర్‌తో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

పోరాటం తప్పదు

- వైసీపీని గద్దె దించి రాష్ట్రాన్ని కాపాడాలి
- సంక్షేమం పేరుతో నిలువు దోపిడీ
- 27 దళిత పథకాలను రద్దు చేశారు
- టీడీపీ శ్రేణులతో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : రాష్ట్రాన్ని సర్వం నాశనం చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు టీడీపీ శ్రేణులు సైనికుల్లా పోరాడాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన టీడీపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో 'ఇదేం ఖర్మ' పేరిట ఒక కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇంతటి దారుణమైన, నీచమైన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. గత మూడున్నరేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కోలుకోలేనంత విధ్వంసం జరిగింది. ప్రజల హక్కులను పూర్తిగా కాలరాస్తున్నారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పే సంక్షేమమంతా బోగస్, ఆ పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇప్పటివరకు 27 దళిత పథకాలను రద్దు చేశారు. దీనిపై గుడివాడలో ఒక మహిళ ప్రశ్నిస్తే ఆమెపై అక్రమ కేసు బనాయించారు. అడుగడుగునా పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రేపు అనేది ఉంటుందని పోలీసులు గుర్తుంచుకోవాలని, తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని చంద్రబాబు హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కొనేందుకు 175 నియోజకవర్గాలలో లీగల్ టీంలు ఏర్పాటు చేశామన్నారు. కుప్పం నియోజకవర్గం అందరికీ ఆదర్శంగా ఉండాలని నేను భావించేవాడిని. కుప్పం ఒక ప్రశాంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ప్రయత్నించాను. ఇక్కడ పోలీసు స్టేషన్, కోర్టులు, జైళ్ల అవసరం రాకూడదనుకునేవాడిని. అలాంటి నియోజకర్గంలో ఇప్పుడు ఈ వైసీపీ దుర్మార్గులను ఎదుర్కోవడానికి నేనే న్యాయవాదు లను వెతుక్కునే పరిస్థితి వచ్చింది. కుప్పంలో 70 మందిని అరెస్టు చేసి 20 రోజులు జైళ్లలో పెట్టారు. మనం ఒక సైకోను ఎదుర్కొంటున్నాం. ఇలాంటి సైకోలను కట్టడి చేయాలంటే తెలుగుదేశం నాయకులు ప్రజల సమస్యల పై చురుకుగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. పోలీసులు అప్రజాస్వామికంగా అర్ధరాత్రులు అరెస్టులు చేయడానికి వస్తే ఏ కేసుపై అరెస్టు చేస్తున్నారో అడిగి రాతపూర్వక నోటీసులు అడగాలి. బ్యాడ్జ్ లేకుండా వస్తే బ్యాడ్జ్ పెట్టుకోమని అడగండి. అదే సమయంలో స్థానిక పార్టీ సభ్యులకు సమాచారం ఇవ్వాలి. పోలీస్ స్టేషన్‌లో విచారణ చేస్తే కచ్చితంగా సీసీ కెమెరాల రికార్డింగు చేయమని అడగాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి ఐపీసీ సెక్షన్లు చదువుకోవాల్సిన అవసరం నాకు రాలేదు. కానీ జగన్ రెడ్డి చట్టవ్యతిరేక పాలన కారణంగా నేడు వాటిని తెలుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

హౌస్ అరెస్టులు చేసే అధికారం పోలీసులకు లేదు

హౌస్ అరెస్టులు చేసే అధికారం పోలీసులకు లేదు. హౌస్ అరెస్టులు చేయాలంటే ఇంటిని జైలుగా మార్చేందుకు పోలీసులు అనుమతులు తీసుకోవాలి. బాబ్లీ ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్రకు మేం వెళ్లినప్పుడు అక్కడి పోలీసులు మమల్ని అరెస్టు చేసి మేమున్న హాస్టల్‌ను జైలుగా మార్చి మమ్మల్ని అక్కడే ఉంచారు. అలా చేయకపోతే వారికి మమ్మల్ని హౌస్ అరెస్టు చేసే అధికారం లేదు. ఒకవేళ అరెస్టు చేస్తే అది చట్టవ్యతిరేకం అవుతుంది. ప్రతి నియోజకవర్గంలో లీగల్ టీంలు ప్ర్యూటినీ చేసి కార్యకర్తలకు న్యాయ సహాయం అందించాలన్నారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జగన్ రెడ్డి రాష్ట్ర సమస్యలను పరిష్కరించలేకే ప్రజలను పక్కదారి పట్టించేందుకు వికేంద్రీకరణ అంటూ మూడు ముక్కలాట ఆడుతున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రకు ఒక్క పైసా ఇవ్వకుండా రాజధాని తెస్తామంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. బ్రిటీషు వాళ్లకు వారసుడిలా జగన్ రెడ్డి వ్యవహరిస్తూ, కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వైసీపీకి ఘోరీ కట్టడం ఖాయమని స్పష్టం చేశారు.

శబరిమలలో బస్సు బోల్తా ఏపీకి చెందిన 43 మందికి గాయాలు

బాలుడి పరిస్థితి విషమం

ఏలూరు/పతనంతిట్ట(కేరళ): శబరిమల భక్తులను తీసుకెళుతున్న బస్సు బోల్తా పడటంతో బాలుడితో సహా 43మందికి తీవ్ర గాయా లయ్యాయి. ఆ బస్సు ఆంధ్రప్రదేశ్‌కు చెందినదిగా గుర్తించగా, ఈ ఘటన పతంట్టి జిల్లాల్లో లెహ ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. వీరిలో ఎనిమిదేళ్ల మణికందన్ పరిస్థితి విషమంగా ఉంది. 44మంది యాత్రికులతో బస్సు విజయవాడ నుంచి బయలుదేరి, అయ్యప్ప దర్శనం అనంతరం తిరిగివచ్చేలా ప్రణాళిక వేసుకోగా, ఇంతలోనే ఈ ఘటన సంభవించినట్టు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో 43మంది గాయపడినట్టు జిల్లా వైద్యాధికారులు నిర్ధారించారు. రోడ్డు మలుపువద్ద బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బోల్తా కొట్టిందని పోలీసులు పేర్కొన్నారు. ఘటన జరిగిన అరగంటలో వారందరినీ కాపాడి, ఘటనా ప్రాంతం నుంచి బస్సును ఉదయం 10గంటలకు తొలగించినట్టు ఆరోగ్యశాఖమంత్రి వీణాజార్జ్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన బాలుడికి అనేకచోట్ల గాయాల య్యాయని, కొట్టయనం ప్రభుత్వ వైద్యశాలలో త్వరలో శస్త్రచికిత్స చేస్తామని ఆమె పేర్కొన్నారు. 'ఐదుగురితోపాటు బాలుడిని కూడా కొట్టాయం వైద్య కళాశాలకు తరలించాం. వారిలో కొంతమందికి శస్త్రచికిత్స అవసరం' అని వీణాజార్జ్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. గాయపడ్డవారిని వైద్యం అందించేందుకు పతనంతిట్ట సాధారణ ఆస్పత్రి, కొన్ని వైద్యకళాశాలకు చెందిన వైద్యులు, నర్సులు ఏర్పాట్లు చేశారు. 38మంది వ్యక్తులకు పతనంతిట్ట సాధారణ ఆస్పత్రిలో చికిత్స అందిం చగా, ప్రమాదం నుంచి బయటపడ్డ వారిని తమ జిల్లాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకుముందు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, మోటారు వాహనాల శాఖ, స్థానికులు స్పందించి ప్రమాద తీవ్రతను తగ్గించేలా ఏర్పాట్లు చేశారు. మంత్రి జార్జ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

వైసీపీ, టీడీపీ కలిసి రావాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో చలసాని

విశాలాంధ్రబ్యూరో–అనంతపురం:ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం నవంబరు 26న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీలో వైసీపీ, టీడీపీ కలిసి రావాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాం డ్ చేసింది. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ అధ్వర్యంలో శనివారం అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయ స్వామి అధ్యక్షత వహించారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐ వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు తదితరులు ప్రసంగిం చారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 26న ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నరేంద్ర మోదీపై పోరాటానికి టీడీపీ, వైసీపీ ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆ రెండు పార్టీలపై ప్రజలు పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. విభజన హామీలలో భాగంగా అనంతపురం జిల్లాకు కేటాయించిన సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు ఇవ్వాలని కోరారు. 25 మంది ఎంపీలను ఇస్తే హోదా సాధిస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మౌనం దాల్చారని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. సీపీఎం నాయకులు నల్లప్ప, బీసీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేశ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి యనుమల నరేశ్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పరమేశ్, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్, జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోశ్ కుమార్ మిడిల్ క్లాస్ యూనిట్ నాయకులు శ్రీనివాసులు ప్రసంగించారు. ఏఐవై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమామహేశ్, నాయకులు వంశీ ఆనంద్, రాజు, రాప్తాడు కార్యదర్శి ధనుంజయ, నగర కార్యదర్శి మోహన్, దేవా, లిఖిత్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం

విశాలాంధ్ర–గుంటూరు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అధ్వర్యంలో 22వ గుంటూరు పుస్తక మహోత్సవాన్ని లాడ్జిసెంటర్‌లో గల ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల 21వ తేదీ నుంచి డిసెంబర్ 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర బుక్‌హౌస్ గుంటూరు మేనేజర్ మల్లికార్జునరావు తెలిపారు. పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివప్రసాద్ మాట్లాడుతూ పుస్తక మహోత్సవాన్ని సాయంత్రం 5.30 గంటలకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, అతిథులుగా విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, జనరల్ మేనేజర్ పి.హరనాథరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ రచయితలు పాల్గొంటారని తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగే పుస్తక మహోత్సవంలో 40 రకాల ప్రచురణ సంస్థలకు చెందిన 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆర్‌కే నారాయణ్, కుశ్వంత్ సింగ్, మహాత్మాగాంధీ, నెహ్రూ, గురజాడ, శ్రీశ్రీ, ప్రఖ్యాత రచయితల రచనలు, వైద్య ఆరోగ్య పాపులర్ సైన్స్ గ్రంథాలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల కోసం అన్ని రకాల కాంపిటేటివ్, గ్రామర్, డిక్షనరీలు, రిఫరెన్స్ బుక్స్, తెలుగు అకాడమీ టెక్స్ట్ బుక్స్ అందుబాటులో ఉంటాయని వివరించారు. పుస్తకాల కొనుగోలుపై 10 శాతం రిబేటు ఇవ్వనున్నట్లు తెలిపారు. పుస్తక మహోత్సవం సందర్భంగా అరసం అధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు, పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి విశాలాంధ్ర వచన కవితా సారథి కుందుర్తి ఆంజనేయులు పేరును, సాహిత్య వేదికకు అభ్యుదయ సాహితీవేత్త ముత్యాల ప్రసాద్ పేరు పెడుతున్నట్లు తెలిపారు. అరసం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఏఎంఆర్ ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర–చెన్నే కొత్తపల్లి: సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజక వర్గం కనగానపల్లి మండల పరిధి లోని బెంగళూరు –హైదరాబాద్ జాతీయ రహదారిపై పర్వత దేవరపల్లి గ్రామ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఇద్దరు చిన్నారులకు గాయాల య్యాయి. బెంగళూరు నగరంలో నివాసముం టున్న అల్లంకు గోపినాథ్ టీఎస్ 08 ఎఫ్ ఎన్ 61 42 నంబర్ గల కారులో కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి వరంగల్‌కు బయలు దేరారు. ఈ క్రమంలో పర్వత దేవరపల్లి సమీపాన జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో రమ్య (26), గోపీనాథ్ (28) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన తారకేశ్వరి(60) చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందారు. 8 సంవత్సరాల వయస్సు గల సాహిత్, సంవత్సరం వయసు గల హాసిని తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కనగానపల్లి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పంచనామా నిమిత్తము ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రముఖ విశ్లేషకులు అశోక్ కుమార్‌కు లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కారం

విశాలాంధ్ర–గుంటూరు: ప్రముఖ సాహితీవేత్త, సినీ విమర్శకులు, పుస్తక రచయిత, విశ్లేషకులు కేపీ అశోక్ కుమార్‌కు "సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కారం" అందజేయనున్నట్టు ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ గురు వారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 26న తాను రచించిన 'విమర్శ వీక్షణం' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా అశోక్‌కుమార్‌ను సాహితీ పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. తన తండ్రి లక్ష్మీనారాయణ పేరిట ప్రతి ఏడాదీ సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్నట్టు వివరించారు. గతంలో ప్రముఖ విమర్శకులు డాక్టర్ కడియాల రామ్మోహన్‌రాయ్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిలకు సాహితీ పురస్కారం ప్రదానం చేసినట్టు ఆమె తెలిపారు. ముఖ్య అతిథిగా అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు విచ్చేయనున్నట్టు పేర్కొన్నారు. అవార్డు గ్రహీత అశోక్ కుమార్... 'కథావలోకనం', 'తెలుగు నవల– వస్తు వైవిధ్యం', 'కథానుశీలనం విమర్శ గ్రంథాలు', 'దళితగీతాలు', 'ఎనిమిదో అడుగు', 'జాంబా పురాణం', 'నోబెల్ కవిత్వం', వెయ్యికి పైగా హాలీవుడ్, తెలుగు సినిమాలపై సమీక్షలు, రెండు వేలకు పైగా పుస్తక సమీక్షలు చేశారని సుశీలమ్మ తెలిపారు. పెద్ద సంఖ్యలో సాహితీ అభిమానులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

Govt of Andhra Pradesh
Collectrate, Kakinada Dist, KAKINADA

Ref.L5/(GEN)/7/2022 **Form No.VII** Dt : 17-11-2022

(Under Section 19 (1) read with Sub Rule (1) of Rule 25 of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation & Resettlement Act, 2013 (Act 30 of 2013)]

DECLARATION

Whereas it appears to the District Collector, Kakinada District that a total extent of Ac.13.73 cts of land is required in the Gopalapatnam village of Thondangi Mandal, Kakinada District is needed for a public purpose to wit for acquisition of land for construction of Railway line, the District Collector, Kakinada District having been satisfied that the land / lands specified in the schedule below has / have to be acquired for public purpose, after having had the objections of the persons interested and after due enquiry as provided U/S 15 of the act 30/2013 and that the requiring body has deposited the amount in full towards the cost of acquisition of the lands, the following declaration is made U/s 19 (1) of the Act, 30/2013 (Central Act 30/2013).

DECLARATION

Under section 19 (1) of the Act 30/2013 (Central Act 30/2013), the District Collector, Kakinada District, hereby, declares that the land / lands specified in the Schedule below and measuring Ac 13.73 cts be the same a little more or less, is/are needed for a public purpose, to wit for acquisition of land formation of railway line.

SCHEDULE

Mandal : Thondangi Village : Gopalapatnam

Sl. No.	Survey No.	Total extent Ac.Cts	Extent under Acquisition Ac.Cts.	Classification	Name of the Pattadar/Enjoyer	Boudaries				Details of Trees, Structurer etc., if any
						North	South	East	West	
1	2	3	4	5	6	7				8
1	119/2A	0.15	0.15	G-Dry	Yadla Suryakumari	110	119/2B	126	110	Coconut-9 Mango-2 Neem-1
2	126/1A	0.31	0.31	G-Dry	Kelam Bhamdhani	109	126/1B	128	119	----
3	128/1	0.68	0.68	G-Wet	Yadla Sattibabu, Yadla Subramanyam	109	128/2	131	126	Coconut Garden
4	134/1B	2.00	2.00	G-Dry	Pothula Sridevi, Chillakamurthi Gowri Satyavathi, Dhanekula Devi, Chitra Varalakshmi	147	134/1C	134/1D	140	----
5	134/2B	0.71	0.71	G-Dry	Chillakamurthi Gowri Satyavathi,Dhanekula Devi, Chitra Varalakshmi	134/1E	134/2C	A.KOTHAPALLI	134/2C	----
6	137/3A	0.36	0.36	G-Wet	Yadla Bhadrarao	108	137/4B	137/3B	131	----
7	137/4B	0.54	0.54	G-Wet	Atti Bhanukumar	137/4A	137/4C	139	137/3A	----
8	138/1A2	0.20	0.20	G-Dry	Chitra Subramanyam	138/1A1	139	138/1B2	137	
9	138/2A2	0.10	0.10	G-Dry	Atti Venkateswarao	138/2A1	139	139	138/1B2	----
10	138/3B	0.05	0.05	G-Dry	Yadla Bangaramma	138/3A	139	140	139	----
11	139/1A1A	0.36	0.36	G-Dry	Gunimanikula Venakata Raju Yadla Raju Ane Abbai, Yadla Nageswarao, Atti Varalakshmi	138	139/1A1B	139/1B1	137	----
12	139/2B1B	0.87	0.87	G-Dry	Yadla Nageswarao, Yadla Suribabu	139/2B1A	139/2B1C	140	138	Coconut Plantation, Banana Plantation, Take-10
13	140/2	3.13	3.13	G-Dry	Yadla Appalaraju YadlaSunitha Gedam Sankararao Gedam Baburao, Nakka Krishnayya, Chitra Bhulakshi, Yadla Suryanarayana Yadla Venkata lakshmi, Yadla Bangaramma, Yadla Bhadrarao, Ragatha Satyanarayanamma, Chitra Subramanyam, Yadla Vishal, Somu, padma	140/1	140/3	140	139	Coconut Plantation
14	142/2	0.26	0.26	G-Dry	Acha Maridayya, Acha Apparao	142/1	145	142/1	141	Sapota Tress
15	142/3	0.19	0.19	G-Dry	Acha Maridayya, Acha Apparao	144	142/4	145	142/1	Sarugudu Tress
16	143/2	0.09	0.09	G-Dry	Pappula Gavaraju	143/1	144	A.KOTHAPALLI	144	Coconut Plantation
17	144/2	1.32	1.32	G-Dry	Acha Apparao, Yadla Narasimha Murthy, Pantaham Ratna kumari, Madi Lavanya, Pappula Gavaraju	143	142	144/3	144/1	Coconut Plantation Sarugudu Tress Teku Tress
18	145/1	1.87	1.87	G-Dry	Acha Maridayya, Komirisetti Krishnaveni	142	146	145/2	141	----
19	146/1B	0.54	0.54	G-Dry	Gedam Sankararao, Gedam Anantha Lakshmi, Gedam Subbarao, Gedam Anantha Lakshmi,Gedam Varalakshmi	145	147	146/1A	147	----
	Total		13.73							

Sd/- Dr. **Kritika Shukla**, I.A.S
Collector & Dist.Magistrate,
Kakinada District, Kakinada

సంపాదకీయం

ఎన్.ఐ.ఏ. వితండవాదానికి కళ్లెం

మోదీ ప్రభుత్వం భీమా కోరేగావ్ కేసును రాను రాను న్యాయమార్గ పాలనను తుంగలో తొక్కడానికే ఉపయోగించు కుంటున్నట్టు రుజువు అవుతోంది. 2018 నాటి భీమా కోరేగావ్ కేసులో అనేకమంది రచయితలను, న్యాయవాదులను, మేధావులను, పౌర హక్కుల కోసం పాటుపడే వారిని నాలుగేళ్లుగా నిర్బంధంలో ఉంచి వేధిస్తున్నారు. తాజాగా ఈ కేసులో ఆనంద్ తెల్తుంబ్డేకు బొంబాయి హైకోర్టు బెయిలు మంజూరు చేయడం సంతోషకరమైన అంశం. కానీ అంతకు ముందు పౌరహక్కుల కార్యకర్త గౌతం నవలఖాను జైలులో కాకుండా గృహ నిర్బంధంలో ఉంచడానికి సుప్రీం కోర్టు గత పదో తేదీననే ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్.ఐ.ఏ.) అమలు చేయకుండా తాత్సారం చేసింది. సుప్రీంకోర్టు నవలఖాకు బెయిలు మంజూరు చేసినప్పుడు విధించిన అనేకానేక షరతుల్లో బొంబాయిలోనే గృహ నిర్బంధంలో ఉండాలన్న షరతు ఉంది. ఆయన ఉండడానికి ఒక చోటు చూశారు. అందులో ఆయన ఉండడానికి వీలు లేదని ఎన్.ఐ.ఏ. వాదించింది. సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించకుండా ఉండడానికి అనేక సాకులు చూపించింది. దాదాపు వారం రోజులు 73 ఏళ్ల నవలఖాను గృహ నిర్బంధంలోకి మార్చనేలేదు. అందువల్ల ఆయన మళ్లీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పలేదు. ఆయన అర్జీని విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కె.ఎం.జోసఫ్, హృషీ కేశ్ రాయ్ శుక్రవారం నాడు జాతీయ దర్యాప్తు సంస్థ నడవడికను తీవ్రంగా తప్పుబట్టారు. 24 గంటలలోగా నవలఖాను గృహ నిర్బంధంలోకి మార్చాలని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పవలసి వచ్చింది. సుప్రీంకోర్టు ఉత్తర్వును అమలు చేయకుండా ఉండడానికి ఎన్.ఐ.ఏ. సాకులు వెతకడం చూస్తే మోదీ ప్రభుత్వానికి న్యాయ మార్గ పాలన మీద, న్యాయ వ్యవస్థ మీద బొత్తిగా గౌరవం లేదని తేలిపోయింది. నవలఖా బొంబాయిలోనే ఉండాలి కనక ఆయనకోసం ఒక ఇల్లు చూశారు. ఆ భవనంలోనే సీపీఐ కార్యాలయం ఉన్నందువల్ల, అందులో ఒక గ్రంథాలయం ఉంది కనక, ఆ ఇంటి వంటగదికి ఉన్న తలుపు సరిగ్గా లేదు కనక, ప్రవేశ ద్వారం వద్ద సీసీ కెమెరా లేదు కనక ఆయన అక్కడ ఉండడానికి వీలు లేదని, అసలు ఆయనను గృహ నిర్బంధంలో ఉంచవలసిన అవసరమే లేదని ఎన్.ఐ.ఎ. వితండవాదానికి దిగింది. ఈ కారణాలన్నీ నిజమే అనుకున్నా నవలఖా మీద ఉన్న ఆరోపణల్లో ప్రధానమైంది ఆయన మావోయిస్టు అన్నదే. ఆయన మీద ఘనత వహించిన మోదీ ప్రభుత్వం తీవ్రవాది అన్న ముద్రా వేసింది. ఆయనకోసం చూసిన ఇల్లు సీపీఐ కార్యాలయం అయితే కావచ్చు. కానీ తుషార్ మెహతా లాంటి "న్యాయకోవిదుడి"కి మావోయిస్టుల మీద సీపీఐ వైఖరి ఏమిటో బొత్తిగా తెలిసినట్టు లేదు. నవలఖా మావోయిస్టు అయినా కాకపోయినా సీపీఐకి చెందిన వారు మాత్రం కాదు. మహా అయితే ఆయన వామపక్ష వాది అయి ఉంటారు. రాజకీయాల దగ్గరికి వస్తే మావోయిస్టులను సీపీఐ సమర్థించిన సందర్భమే లేదు. ఈ మాత్రం కూడా తుషార్ మెహతా లాంటి "ఉద్దండుల"కు ఎందుకు అర్థం కాదో ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తమ ఉత్తర్వును అమలు చేయడానికి ఇష్టం లేని ఎన్.ఐ.ఎ. ఆంతర్యం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సవ్యంగానే గ్రహించారు కనక ఎన్.ఐ.ఏ. పని తీరును తూర్పారబట్టారు. ఈ వ్యవహారం అంతా చూస్తే కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష తీర్చుకోవడానికి ఇచ్చే ప్రాధాన్యం చట్టబద్ధంగా వ్యవహరించడానికి ఇవ్వదు అని రుజువు అయి పోయింది. వయసు మళ్లిన నవలఖా తప్పించుకు పోకుండా చూడవలసిన బాధ్యత పోలీసులదే. ఎన్.ఐ.ఏ. సాకులన్నీ విన్న సుప్రీం కోర్టు 73 ఏళ్ల వ్యక్తి పారిపోకుండా చూడలేరా అని నిలదీసింది. ఇది అమిత్ షా నాయకత్వంలో పని చేసే ఎన్.ఐ.ఏ.కే తలవంపులు మాత్రమే కాదు. ఇందులో కేంద్ర హోం శాఖను నిర్వహిస్తున్న అమిత్ షా కక్ష సాధింపు ధోరణి ఎంత తీవ్రమైందో అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే ఎన్.ఐ.ఏ. నేరుగా ఆయన పర్యవేక్షణలోనే ఉంటుంది.

ఈ కేసులో సుప్రీంకోర్టు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను నిలదీసిన తీరు న్యాయవ్యవస్థ ఇంకా మోదీకి సంపూర్ణంగా దాసోహం కాలేదన్న భరోసా కలుగుతోంది. ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పులు ఇవ్వడానికి ఒకరితో ఒకరు పోటీ పడ్తున్న న్యాయమూర్తులు ఉన్న దశలో న్యాయమూర్తులు జోసఫ్, హృషీ కేశ్ రాయ్ ఎన్.ఐ.ఏ. ధోరణిని ఎండగట్టడం భవిష్యత్తు మీద ఆశలు పూర్తిగా ఆవిరి కాలేదన్న నమ్మకం కలుగుతోంది. నవలఖా ఉండడానికి ఏర్పాటు అయిన చోట సీపీఐ కార్యాలయం ఉందన్న సోలిసిటర్ జనరల్ వాదన ఎంత అసంబద్ధమైందో చెప్పడానికి న్యాయమూర్తులు సీపీఐ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదా అని నిలదీయవలసి వచ్చింది. ఎన్.ఐ.ఏ. వితండవాదం అక్కడితో ఆగలేదు. నవలఖా ఆరోగ్యం గురించి ఇచ్చిన వైద్యుల నివేదిక పక్షపాతంతో కూడుకున్నదని ఎన్.ఐ.ఏ. తరఫున వాదిస్తున్న సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచిత్రమైన అభ్యంతరం లేవదీశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వునే ఖాతరు చేయకూడదన్న దృఢ సంకల్పంతో ఉన్న మోదీ ప్రభుత్వం వైద్య నివేదికను తప్పుపట్టడంలో వింతేమి ఉంది? అన్నింటికన్నా మించి నవలఖాను గృహ నిర్బంధంలో ఉంచాలన్న ఉత్తర్వును రద్దు చేయాలని ఎన్.ఐ.ఏ. సాక్షాత్తు సుప్రీంకోర్టునే కోరడం మోదీ ప్రభుత్వం చట్టాన్ని వికృతీకరించడానికి ఏ స్థాయికి దిగజారగలదో స్పష్టం అవుతోంది. భీమా కోరేగావ్ కేసులో ప్రభుత్వం కక్ష సాధించినట్టు వ్యవహరిస్తోందన్న వాస్తవం సుప్రీంకోర్టుకు ఇప్పటికే అనేక సార్లు అర్థమైంది. ఎన్.ఐ.ఏ. అధికారులు లేదా వారి వెనక ఉన్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోని కొందరి వ్యవహార సరళినీ సుప్రీంకోర్టు గ్రహించకపోలేదు. భీమా కోరేగావ్ కేసులో ఇప్పటికే సుధా భరద్వాజ్, వరవర రావు, ఆనంద్ తెల్తుంబ్డేకు బెయిలు మంజూరు అయింది. కానీ ఈ కేసులో అనేకమందిని అరెస్టు చేసి నాలుగేళ్లు దాటినా విచారణ ఎందుకు ప్రారంభం కావడం లేదని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం నిరాశనే మిగులుస్తోంది. నిర్బంధమే పెద్ద శిక్షగా మారుతున్న దశలో సుప్రీంకోర్టు ఈ ప్రశ్న అడిగితే న్యాయమార్గ పాలనకు అత్యున్నత న్యాయస్థానం అపారమైన విలువ ఇచ్చినట్టు అయ్యేది. మోదీ ప్రభుత్వానికి మానవహక్కుల మీద ఎలాంటి గౌరవమూ లేదు. ఎవరి మీద అయినా ముందూ వెనక ఆలోచించకుండా మావోయిస్టులు, అర్బన్ నక్సలైట్లు అన్న ముద్ర వేయడానికి లేశ మాత్రం కూడా ఈ ప్రభుత్వం ఆలోచించదు. మావోయిస్టుల కార్యకలాపాల మీద నిషేధం ఉంటే ఉండొచ్చు. ఒక ఆలోచనా ధోరణిని ప్రభుత్వాలు ఎలా నిరోధించగలవు? వక్ర మార్గంలో గల ఆలోచనా ధోరణులను నియంత్రించడానికి మోదీ ప్రభుత్వం పన్నుతున్న ఉచ్చులను సుప్రీంకోర్టు చూస్తూ ఊరుకోవడం పౌర హక్కులకు, భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తాయి. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు పట్టించుకోవలసిన అగత్యం ఉందన్నది నిరాకరించదగినంత చిన్న విషయం కాదు. ప్రభుత్వాలు న్యాయమార్గ పాలనను ఖాతరు చేయనప్పుడు నిలదీయడం సుప్రీంకోర్టు బాధ్యత.

నిబద్ధత గల కమ్యూనిస్టు కాంతారావు

అత్యంత నిబద్దత గల కమ్యూనిస్టు, ప్రముఖ న్యాయవాది కాంతారావు మరణం సీపీఐకే గాక గుంటూరు ప్రాంత ప్రజలకు తీరనిలోటు. వినుకొండలో 1980 ప్రాంతంలో 300 మంది ముఠా కార్మికుల సమ్మె విజయవంతం చేయించిన ఘనత కాంతారావుదే. ఈ ప్రాంతంలో అసంఘటిత రంగంలో జరిగిన మొదటి సమ్మె ఇదే. కార్మికులు తమ సైకిళ్లకు ఎర్ర జెండాలు కట్టి, సమ్మె విజయం సాధించే వరకు వాటిని తీయరాదని నిర్ణయించారు. వినుకొండ చుట్టుపక్కల గ్రామాలన్నీ ఎర్ర జెండాలు, సైకిళ్లతో కళకళలాడాయి. అప్పటి జనసంఘ్, కాంగ్రెస్ పార్టీల నాయకులు కార్మికుల సమ్మెను విఫలం చేయాలని అనేక ప్రయత్నాలు చేశారు. బెదిరించారు. సమ్మె విరమిస్తే కార్మికుల కోర్కెలన్నీ తీరుస్తామన్నారు. 15 రోజుల తర్వాత ఎటువంటి ఒప్పందం జరగకుండానే సమ్మెను విరమించాలనే ఆలోచనలు ప్రారంభమయ్యాయి. మరొక 4,5 రోజులు సమ్మె కొనసాగితే కూలీరేట్ల పెరుగుదలతో పాటు ఇతర సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఆ సమయంలో సమ్మెకు మద్దతుగా వినుకొండలో పెద్ద ఎత్తున సంఘీభావ ర్యాలీ నిర్వహించి కార్మికులలో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలకు కాంతారావు నడుంకట్టారు. ఆయన సలహా మేరకు వెయ్యి మందికి పైగా పార్టీ కార్యకర్తలు, వివిధ రంగాల కార్మికులతో సంఘీభావ ర్యాలీ జరిగింది. సమ్మెకు నాయకత్వం వహించి ర్యాలీకి కార్మికులను సమీకరిచాను. కార్మికుల్లో ఉత్సాహం ద్విగుణీకృతం అయింది. సమ్మెను పరిష్కరించాల్సిన అవసరాన్ని యజమానులు గుర్తించారు. మొట్టమొదటిసారిగా, కార్మికులు విజయం సాధించారు.

1987లో గ్రామీణ ప్రాంతాలకు తిరిగే ప్రైవేట్ బస్సుల కార్మికులు సమ్మె చేపట్టారు. తీవ్ర ఘర్షణల అనంతరం సెక్షన్ 307, మరిన్ని సెక్షన్ల క్రింద కార్మికులపై ఎటెంప్ట్ మర్డర్ కేసులు బనాయించారు. దాదాపు 4 సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిరిగాక ఆ కేసులు కొట్టివేశారు. కాంతారావు నరసరావుపేటలో ప్రముఖ క్రిమినల్ లాయర్, సీపీఐ నాయకులు కావడంతో ఆ రోజుల్లో పార్టీ కేసులన్నీ ఆయనే చూసేవారు. ఈ కేసు విచారణలో ఉండగానే ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయ్యారు. దీంతో ఈ కేసును ఆయన జూనియర్ చార్లెస్ చేపట్టారు. కొద్దికాలంలోనే ఛార్లెస్ జడ్జి అయ్యారు. కార్మికులు నేరం చేసినట్లుగా పి.పిగా ఉన్న కాంతారావు ఋజువు చేయాల్సి ఉంది. కానీ, కోర్టులో ఆయన అందుకు విరుద్ధంగా వాదించి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. ముద్దాయిలు నేరం చేశారని ఋజువుచేసే సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచడంలో పోలీసులు విఫలమయ్యారని పి.పి స్వయంగా చెప్పటంతో, జడ్జితో సహా అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

డిఫెన్స్ లాయర్ చార్లెస్ వాదన ప్రారంభించబోతుంటే, జడ్జి నవ్వుతూ డిఫెన్స్ చెప్పాల్సిందంతా ప్రాసిక్యూషన్ వారే చెప్పారుగా, ఇంకా మీరు చెప్పేదేముంది అని చమత్కరించారు. కోర్టు నుండి బైటకు వచ్చాక పి.పి అయిఉండి మీరే డిఫెన్స్ లాయర్‌లాగా మాట్లాడారేమిటి అని అడగగా, ఏ వృత్తిలో ఉన్నా కమ్యూనిస్టు తన ఉనికిని చాటుకోవాలి, నేను అదే చేశానని ఆయన నిరాడంబరతను చాటుకున్నారు. ఉద్యోగస్తులకు మెమోలు, ఛార్జ్ షీట్లు ఇచ్చి వేధింపులకు గురిచేస్తున్న సందర్భంలో సమాధానం రాయటానికి కాంతారావు సలహాలు తీసుకున్న సందర్భంలో ఆ మెమోలు, ఆరోపణలు చదివి నేనైతే మిమ్మల్ని ఉద్యోగాల నుండి తీసేసేవాడిని అని భయపెట్టేవారు. తన దగ్గరకు న్యాయసలహా కోసం వచ్చేవారు నేరం చేశాడా లేదా అనే విషయాన్ని ఖచ్చితంగా పసికట్టేవారు. సభలు, సమావేశాల్లో ఆయన ఉపన్యాసాలు ప్రత్యేకంగా ఉండేవి. వర్తమాన సామాజిక, రాజకీయ అంశాలను భారత, రామాయణంలోని అంశాలతో పోలుస్తూ మాట్లాడేవారు. నర్సారావుపేటలో రాజకీయ ప్రత్యర్థుల నుండి తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొన్నారు. కామ్రేడ్స్ పోపూరి బ్రహ్మానందం, వై.చెంచయ్య, షేక్ బుడే తదితరులతో కలిసి ఎదుర్కొన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల ఏర్పాటు, విస్తరణతోపాటు, ప్రత్యర్థుల దాడి నుండి వాటిని కాపాడటంలో కీలకపాత్ర పోషించారు. ఆయన గొప్ప స్నేహశీలి, అజాత శత్రువు. మంచి కమ్యూనిస్టు. మార్క్సిజం, లెనినిజం పట్ల అచంచల విశ్వాసం ప్రకటించేవారు. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా అందరి ప్రేమాభిమానాలు పొందారు. నీతి, నిజాయితీలతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు.

- వెలుగూరి రాధాకృష్ణమూర్తి

మళ్లీ ప్రజాకళలు వెలుగులీనాలి

జూనియర్ నాజర్ 44 వర్థంతి కార్యక్రమాన్ని నవంబర్ 11న ప్రజా నాట్యమండలి స్థానికశాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించింది. సీనియర్ కళాకారులకు సన్మానాలు, జూనియర్ నాజర్ ప్రతిభాపాటవాలూ ప్రజా సాంస్కృతికోద్యమం చరిత్ర గురించిన కళాకారుల ఉపన్యాసాలు, బొబ్బిలి యుద్ధం, పల్నాటి యుద్ధం, అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. జాతీయోద్యమం, సంఘ సంస్కరణలు, కమ్యూనిస్టు పార్టీ లక్ష్యంగా ఈ మూడు అంశాల మీదా ప్రజల్ని చైతన్యం చేయడానికి, ముఖ్యంగా పామరజనాన్ని మేల్కొలపడానికీ జానపద కళల్ని కళా రూపాలుగా స్వీకరించడం, సంరక్షించడం, ప్రదర్శించడం ప్రజా నాట్యమండలితోనే మొదలైంది. ఇందువల్లనే ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లో జానపద కళలు ప్రధాన భాగంగా వుంటాయి. జానపద కళారూపం ప్రజల్లో ముందే వేళ్లానుకుని ఉన్నది కావడంవల్ల హాస్యం, స్థానికత, సందర్భం తదితర అంశాలకు ప్రజా చైతన్య కోణం మేళవించి, ప్రజల మనసులకు హత్తుకునేటట్లు ప్రదర్శించడం ప్రజా నాట్యమండలికి సాధ్యం అయింది.

జానపద కళల్లో రాజును పొగడడం తప్ప, నిరంకుశ పాలనను తెగడడం అనే కోణం ఉండదు. భుక్తి సంపాదించుకోవడానికి ప్రజలను ఆకట్టుకోవడం తప్ప ప్రజల ఆసక్తులు గురించిన పట్టింపు వీటికి వుండదు. ఇందువల్ల జానపద కళల్లో ప్రజాకోణం కానరాదు. ఈ కోవకు చెందిన కళాకారులు కూడా తమ యథాతథ వస్తువు, మాటతీరుతో ప్రజానాట్యమండలికి ఒక చిన్న పార్శ్వంగా వున్నారు. వీరిని ప్రజల్లో భాగంగానే చూడాలి. సామ్రాజ్యవాద సంస్కృతి ఉప్పెన ముంచెత్తుతున్న ప్రస్తుతం ప్రతీ చిన్న దేశీ కళారూపాన్ని సంరక్షించుకోవడం అనే కోణంలో దీన్ని చూడాల్సివుంది. ఈ విధంగా జానపద కళలు పుట్టి, పెరిగి, పరిఢవిల్లిన గత 9-10 శతాబ్దాల చరిత్రకు ప్రజానాట్యమండలి సజీవ ప్రతినిధిగా నిలిచింది. జానపద కళల్ని ప్రజా కళలుగా మలచడం అనే ప్రక్రియను ప్రజా నాట్యమండలి 1940 నుంచీ ప్రారంభించింది. 1947కు ముందు మన దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే వ్యవస్థ లేదు. ప్రజానాట్యమండలి కళారూపాల్లో బొబ్బిలి యుద్ధం వంటి ఫ్యూడల్ వ్యవస్థ తాలూకు కళారూపంవున్నా ఈ రచనల్లో ఫ్రెంచ్ పాలనాధికారి బుస్సీ జోక్యం వుండడంతో జాతీయోద్యమ భావజాలంలో భాగం అయింది. జానపద కళారుపాలన్నిటినీ ప్రజానాట్యమండలి స్వీకరించింది. హరికథ, బుర్రకథ, కొమ్మదాసరి, పిట్టల దొర, జంగం దేవర, బుడ బుక్కలు, గొల్ల సుద్దులు తదితర కళారూపాలతో నిరక్ష రాస్యులను, పల్లె పామర జనాలను చైతన్యం చేయడంలో ప్రజా నాట్యమండలి విజయవంతం అయింది. కళ కోసమే కళ కాదంటూ కళ బతుకును మార్చాలంటూ ప్రజా కళలకు ప్రాణం పోసిన గరికపాటి రాజారావూ... అంటూ ప్రజా కళాకారులందరూ ముక్తకంఠంతో కీర్తిస్తారు.

1940-60 కాలం ప్రజానాట్యమండలికి స్వర్ణయుగం. ఒక వైపు జాతీయోద్యమం, మరో వైపు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన భూమి కోసం, భుక్తి కోసం కార్మిక, కర్షక పోరాటాలు, ఇంకో వైపు అంటరానితనం నిర్మూలన, వితంతు వివాహాలు రద్దు, వరకట్న నిషేధం, అందరికీ విద్య వంటి రాజకీయ, సామాజిక సంఘర్షణలు ప్రజా నాట్యమండలి అపారమైన కృషికి రంగస్థలం సమకుర్చాయి. 200 సంవత్సరాల వలస పాలన అంతమై 1947 ఆగష్టు 15 స్వాతంత్రం ప్రకటననాటికి ప్రజా నాట్యమండలి తన కార్యక్షేత్రంలో ఊపిరి పీల్చుకునే సమయం చాలని స్థితిలో వుంది. 1947కు ముందూ తదుపరి కొద్ది సంవత్సరాలపాటు కమ్యూనిస్టు పార్టీతో పాటు ప్రజానాట్యమండలి కూడా తీవ్ర నిర్బంధాన్ని అనుభవించింది. 1947 ఆగష్టు 15 స్వాతంత్రం అనే ఆనందం ప్రజానాట్యమండలికి సుదూరంలో నిలిచిపోయింది. ముఖ్యంగా నెహ్రూ సోషలిస్ట్ విధానాల మీద పెట్టుకున్న అతి అంచనాలతోపాటు, స్వాతంత్ర్య ఫలాలు ఆశేష ప్రజానీకానికి అందకుండా గద్దఎత్తుకు పోవడానికి ముందే సన్నద్ధమై, అధికారాన్ని గుప్పిట ఉంచుకున్న భూస్వామ్య పెత్తందారీ వర్గాలు, ముఖ్యంగా పటేల్ విధానం కమ్యూనిస్టు పార్టీ పురోగతిని బలంగా అడ్డుకున్నాయి. దీన్ని అధిగమించి పార్లమెంటులో, అనేక రాష్ట్ర అసెంబ్లీలో గణనీయమైన పురోగతితో ముందుకు నడుస్తున్నప్పటికీ, 1960ల నాటి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత విభేదాలు, రష్యా-చైనా రెండు శిబిరాలు, భారతదేశంలో 1964, 1967 చీలికలు కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనాన్ని మందగింప చేసాయి. దీని పర్యవసాలు ప్రజానాట్యమండలి పురోగతినీ ఆటంక పరిచాయి.

ప్రజా కళాకారుడుకి, ప్రజా కళాసంస్థలకు, రైతు, ఉద్యోగి, కార్మికుడు, వ్యాపారిలాగా సొంత ఆర్థిక వనరు వుండే ప్రసక్తి లేదు. ప్రజల ఆదరణతో పొట్టపోసుకోవడం, కప్పిన శాలువాతో చలి కాచుకోవడం తప్ప మరో జీవన మార్గానికి అవకాశం వుండదు. ఆపదవస్తే యాచన తప్ప అప్పు దొరికే దారి ఉండదు. అప్పు తెచ్చినా తీర్చే మార్గం వుండదు. రెండు దశాబ్దాలపాటు తెలుగు సాంస్కృతికోద్యమాన్ని మలుపుతిప్పిన ప్రజానాట్యమండలి కళాకారులు కమ్యూనిస్టుపార్టీ ఎదుగుదలలోని వైఫల్యాలు, ఆటంకాలు, మందగమనంతో తీవ్ర కష్టనష్టాలకు గురయ్యారు. నేటికీ వీరి కుటుంబాలు తేరుకోలేదు. ఈ ఆవరోధాలు వుండి వుండకపోతే తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమం కళ్ళు జిగేలుమనేలా, గొప్ప సాంస్కృతిక శక్తిగా నిలిచి ప్రజా జీవనాన్ని మరింత సంపన్నం చేసి ఉండేది.

జానపద కళలకు జీవంపోసి, ప్రజాసాహితోద్యమాన్ని సృష్టించి, అభివృద్ధిచేసి, ప్రజలకు చేరువచేసి, ప్రజల భాగ్యోదయంలో భాగస్వాములైన ప్రజానాట్యమండలి కళాకారుల కృషి ఫలితాలు ఇచ్చే రోజు దగ్గరలోనే వుందని ఆశిద్దాం. కళారంగానికి తమ జీవితాల్ని అంకితంచేసి, కుటుంబాల అభివృద్ధిని త్యాగంచేసి, ప్రజా సాంస్కృతికోద్యమాన్ని నేడూ కొనసాగిస్తున్న వారి ఈతి బాధల గురించి 'ప్రజాస్వామ్య' ప్రభుత్వ నేతలకు పట్టడం లేదు. కనీసం గుర్తింపు కార్డు, పిసరంత పెన్షన్ ముట్టచెప్పడానికి కూడా చేతులు రావడం లేదు. దాని కోసం పోరాటాలు చేయాల్సివస్తున్నది. సామాజిక అభివృద్ధిలో ప్రజాకళల ప్రాధాన్యం తెలిసిన మంత్రి ఒక్కరూ ప్రభుత్వంలో లేని స్థితివుంది. ప్రజా సాంస్కృతికోద్యమం, దీనితో పెనవేసుకున్న తమ జీవితాల గురించి బెంగతో కుములుతున్న ప్రజాకళాకారులు అనారోగ్యంతో వున్నప్పుడు తన ఆసుపత్రిలో వైద్యం అందిస్తూ, ఆర్థికంగా సహాయపడుతూ, జూనియర్ నాజర్ వర్ధంతి లాంటి కార్యక్రమాలకు పిలిచి, శాలువా కప్పి సత్కరించి, కళాకారుడికి ప్రాణ సమానమైన అభినందనల్ని పుష్కలంగా అందిస్తూ, కళాకారులు కార్చుతున్న కన్నీళ్ళను కాసేపైనా ఆనంద భాష్పాలుగా భావించుకునే అవకాశం కల్పిస్తున్న డాక్టర్ చెలికాని స్టాలిన్ కృషి అభినందనీయం.

- కొండా దుర్గారావు, సెల్ : 8466016303

అజ్ఞానాంధకారానికి కోటి దీపాలెందుకూ?

డాక్టర్ దేవరాజు మహారాజు

"పిల్లలకు చదవడం, రాయడం నేర్పడం కాదు. తాము చదువుతున్నదాన్ని ప్రశ్నించడం నేర్పండి. జాతి భవిత పూర్తిగా దానిపైనే ఆధారపడి ఉంది"- జార్జి క్లారిన్ అమెరికన్ విమర్శకుడు.

అజ్ఞానాంధకారం పారద్రోల డానికి దేవుడి పేరిట కోటి దీపాలు అవసరం లేదు. చిన్ని జ్ఞాన దీపం చాలు! మనుషుల్లో ఉన్న అజ్ఞానాన్ని, అంధకారాన్ని పారద్రోలే ప్రయత్నాలు జరగాలి. కోటి దీపాలు వెలిగిస్తే భక్తి-ముక్తి తెగవచ్చి పడుతుందనుకోవడం శుద్ధ అబద్ధం. పూజలు చేయడం వల్ల నూనె, నెయ్యి, పసుపు,కుంకుమ, పూలు వృధా అవుతాయి. ఖర్చు వృధా అవుతుంది. సమయం వృధా అవుతుంది తప్ప, ఒరిగేదీమీ ఉండదు. ఇలాంటి వన్నీ మతాధిపతులకు, స్వామీజీలకు, ప్రవచకులకు, వారివారి నిర్వాహకులకు తప్ప సామాన్య జనానికి ఏ మాత్రం ఉపయోగపడవు. ఇవి నిర్వహించే టెలివిజన్ ఛానళ్లకు ఉపయోగపడతాయేమోగానీ, ప్రేక్షకులకు ఉపయోగపడవు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచాలంటే దేవుణ్ణి అడ్డుపెట్టుకుని దీపాలు వెలిగించడం కాదు. ప్రజల్ని జ్ఞానం వైపు అడుగులు వేయించాలి. అందుకు కావల్సింది ఆధ్యాత్మిక గురువులు మాత్రం కాదు. జ్ఞానులైన భౌతిక శాస్త్రవేత్తలు, రసాయన శాస్త్రవేత్తలు, జీవ శాస్త్రవేత్తలు, ఖగోళ, వాతావరణ, పర్యావరణ శాస్త్రజ్ఞులు కావాలి. ఆయా అంశాల్ని సులభంగా, సరళంగా చెప్పగల ఉపన్యాసకులు, బుద్ధిజీవులూ కావాలి. ముఖ్యంగా రచయితలు కావాలి. మనిషిలో తరతరాల నుండి పేరుకుపోయిన అజ్ఞానాన్ని వెలికి తీసేవారు కావాలి. అంతేగాని, కోటి దీపాలు వెలిగించడం వల్ల ఏమవుతుంది? ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాల్ని మరింతగా పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి తప్ప మరెందుకు ఉపయోగపడవు.

ఇటీవల ఒకాయన కోటి గ్రంథాల వితరణ కార్యక్రమం చేపట్టాడు. నిష్కామసేవా మహాయజ్ఞం-ఉచిత గ్రంథ వితరణ, అని తనకు తానే ప్రకటించుకున్నాడు. తన పరిచయం కూడా తనే ఈ విధంగా ఇచ్చుకున్నాడు. "శివశక్తి శిరిడీసాయి అనుగ్రహ మహా పీఠాధిపతి, శక్తిపాత సిద్ధయోగీశ్వరులు, తత్త్వదర్శి, సిద్ధగురు" అనే ఉపోద్ఘాతంతో తన పేరు ప్రకటించుకున్నాడు. ఈయన సిద్ధాంతమేమిటంటే "శివుడే దేవాధిదేవుడు. ఆది దేవుడు. పరమ పురుషుడు" అని! ఈయన 121 అధ్యాయాలతో 11 కొండలతో, 456 పేజీలతో ఒక మహాగ్రంథం రచించాడట! అది నాలుగు వేదాల్ని, నూట పదహారు ఉపనిషత్తుల్ని, నూట ఎనిమిది పురాణాల్ని, ఎన్నో ఇతిహాసాలను, స్మృతులను, విభిన్న శాస్త్రాలను, విభిన్న మతాల గ్రంథాలను సునిశితంగా పరిశోధించి రచించిన అసామాన్య గ్రంథం" అని తనకుతానే ప్రకటించుకున్నాడు. తన గ్రంథం గూర్చి ఆయనే ఇంకా ఇలా రాసుకున్నాడు. "శివుడిని గాక, మరొక దైవాన్ని దేవాది దేవుడనడం, శివుడిలో శతకోటి అంశయైన దైవాన్ని దేవ దేవేరుడనడం ఏ విధంగా భ్రాంతియో, అవివేకమో వివరించిన అసాధారణ గ్రంథం. మోక్షాన్ని ప్రసాదించే విశిష్ట గ్రంథం..18 సంవత్సరాల శాస్త్ర అధ్యయనంతో, తపస్సుతో, ధ్యానంతో అనుభవ, అనుభూతులతో గ్రహించిన నిగూఢ రహస్య జ్ఞానాన్ని బహిర్గతం చేసిన విలక్షణా మహత్ గ్రంథం..శ్రద్ధతో భక్తితో చదవండి..తరించండి" తనకుతానే తన పుసక్తం గురించి ఇంతలా ప్రకటించుకున్న పీఠాధిపతి కీర్తి కండూతి ఇక్కడ అవగతమౌతుంది. సమకాలీన సమాజం ఎలా ఉంది అనే ధ్యాస లేకుండా, శివుడికి శిరిడీసాయికి సంబంధం కలిపి 'మేథావి' పాపం కోటి పుస్తకాలు అచ్చేసి పంచిపెట్టమన్నా జనంలో స్పందన లేదేమిటి? మత రహిత సమాజం కోసం ఒక వైపు ప్రయత్నాలు జరుగుతూ ఉంటే హిందూ దేవుళ్లందరిలోకి కేవలం శివుడే దేవాదిదేవుడంటే ఇతర దేవుళ్లు, వారి భక్తులూ ఒప్పుకుంటారా? ఆయన అజ్ఞానాన్ని జనం ఇంకా భక్తితో చదివి తరించాలట? పాపం! అజ్ఞానంతో రాసిన పుస్తకాలు కోటి ప్రతులుపంచి పెట్టుకున్నా ఫలితం ఉండదు. అజ్ఞానాన్ని పారద్రోలే ప్రయత్నాల్ని పక్కనపెట్టి, కోటి దీపోత్సవాలు చేసినా ఫలితం ఉండదు. చేసినవారికి సంతృప్తిగా ఉంటుందేమోకాని, అది వారి వ్యక్తిగతం. సమాజానికి ఒనగూరేది ఏమీ ఉండదు.

క్లాసులో ఫస్ట్‌ర్యాంక్ కోసం ఇద్దరు పిల్లలు వారివారి మతాలకు అనుగుణంగా వారివారి దేవుళ్లకు మొక్కుకున్నారట. "నన్ను క్లాసులో ఫస్ట్ మార్కులు తెచ్చుకునే విధంగా అనుగ్రహించు యహెూవా" అని క్రిస్టియన్ బాలుడు వేడుకున్నాడు. "నన్నేక్లాసులో ఫస్టుగా నిలబెట్టు స్వామీ" అని మరో హిందూ బాలిక గణేశుణ్ణి ప్రార్థించింది. అంటే గణేశునికి, ఏసుకు యుద్ధం జరగాల్సిందేనా? మొక్కుకున్నవాళ్లు టెన్షన్ లేకుండా హాయిగా ఉంటారు. దేవుళ్లు మాత్రం టెన్షన్ పడి కయ్యానికి కాలుదువ్వుతారన్నమాట! ఇప్పటి కార్పొరేట్ విద్యావిధానం ఏ స్థాయికిపోయిందో చెప్పడానికి ఓ కార్టూనిస్ట్ కార్టూన్ గీశాడు. అందులో ఒక డాక్టరు డెలివరీ కోసం వచ్చిన గర్భిణీతో ఇలా అంటాడు. "డెలివరీ కాగానే శిశువుకు క్లాస్ స్టార్ట్ చెయ్యాలండి.. లేకపోతే స్టాండర్డ్ అందుకోవడం కష్టం. బిడ్డ వెనకబడిపోయే అవకాశంఉంది. అందుకే మా స్కూల్లో గర్భిణులకు డెలివరీ సదుపాయం కల్పించాం. ఆ అవకాశాన్ని వాడుకోండి" అంటే బిడ్డ పుట్టకముందునుండే ఫీజు వసూలు కార్యక్రమం మొదలవుతుందన్నమాట! శ్రద్ధగా చదువుతూ, విషయ పరిజ్ఞానం సంపాదించడం ముఖ్యమని పిల్లలకు చెప్పాలి. దేవుళ్లకు మొక్కుతూ కూర్చోవడం వల్ల ఫలితాలేమీ ఉండవని పిల్లలకు అర్థం చేయించాలి. జీవితాన్ని జీవించడంలో ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కోవడం ముఖ్యంగానీ, ర్యాంకుల గొడవల్లో పడి, మానసిక ఒత్తిళ్లకు గురై ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నది వారికి తెలియాలి. ఒప్పేదో తప్పేదో తెలుసుకుంటూ, నీతిమంతంగా గౌరవంగా బతకడానికి మతమేదీ అవసరం లేదన్నది వారికి చిన్న వయసులోనే తెలియాలి.



"భగవంతుడున్నాడు. అతడు స్వర్గ నరకాల్ని చూసుకుంటు న్నాడు" అని కొందరు నమ్ముతున్నారు కదా! సరే అ విషయం పక్కన పెట్టండి. మరి ఈ భూమి సంగతి ఎవరు చూడాలి? పర్యావరణాన్ని మనిషి కలుషితంచేస్తూ ఉంటే దేవుడొచ్చి శుభ్రం చేస్తాడా? చేయడు కాదా? ఏది చేసినా మనిషే చేయాలి. ఈ భూమిని కాపాడుకోవాల్సింది మనిషి మాత్రమేనని పిల్లలకు చెప్పండి. ఇందులో దేవుడి ప్రమేయం, మత ప్రమేయం ఏమీ లేదన్నది గ్రహించుకోండి. ఈ తరానికి అందిన ఈ భూమి, ఈ ప్రకృతి, ఈ గాలి, ఈ నీరు ఇంతే స్వచ్ఛంగా వచ్చే తరాలకు అందించాల్సిన బాధ్యత ఈ తరం వారి మీదే ఉంది. మనిషి తనలోని నీచ ప్రవృత్తిని, అలసత్వాన్ని, అహాన్ని, బాధ్యతారాహిత్యాన్ని పక్కనపెట్టి తననూ తన తరాన్ని కాపాడుకుంటూ వచ్చేతరాలకు ప్రశాంతంగా బతికే అవకాశం ఇవ్వాలికదా? వాస్తవాల్ని గ్రహించకుండా బాధ్యతల్ని దేవుళ్లకు, దయ్యాలకు అంటగట్టడం మూర్ఖత్వమవుతుంది. పలాయనత్వమౌతుంది. మానవత్వాన్ని, వివేకాన్ని ముందుకు రానివ్వాలి. అదే విషయం పిల్లలకూ బోధిస్తుండాలి.

హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (జీఈయస్) 2017లో మహిళాసాధికారత గురించి మాట్లాడుతూ మోదీ, ఝాన్సీలక్ష్మీబాయి ప్రసక్తి తెచ్చారు. దేశంలోని మహిళ లందరికీ ఝాన్సీ ఆదర్శప్రాయం కావాలని ఆయన ఉద్దేశం. అయితే ఇప్పుడు రాజ్యాలు లేవు. కత్తియుద్ధాలు లేవు. ఆధునిక స్పృహతో మహిళలకు స్ఫూర్తిదాయకంగా ఉండే పేర్లు చెప్పదలిస్తే కల్పనాచావ్లా, సునీతా విలియమ్స్ పేర్లు చెప్పాల్సింది. లేదా ఈ కాలపు మహిళా శాస్త్రవేత్తల పేర్లు, పారిశ్రామికవేత్తల పేర్లు చెప్పాల్సిందికదా? అంటే ఆయన తననుతాను అప్‌డేట్ చేసుకోలేదన్నమాట! అక్కడి సమ్మిట్‌కు గొప్పవాళ్లంతా వచ్చారు. నిజమేకానీ, భారతీయ మహిళ స్థితిగతుల్ని తెలుసుకున్నవారెవరూ లేరు. ఆడపిల్లల్ని పిండదశలోనే తుంచేయడం, ఒకవేళపుట్టినా సరైన తిండీ, విద్య అందించకపోవడం, కొంచెం ఎదిగితే యాసిడ్ దాడులు, లైంగిక దాడులు, గృహహింస ఇవన్నీ ఎదుర్కొని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగగలరని ఎలా అనుకుం టున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు వారికెవ్వరికీ తెలిసినట్టు లేదు. సంప్రదాయాలతో చాదస్తాలతో వారిని కట్టిపడేసి, స్వేచ్ఛగా ఎగరాలని ఎలా ఆశిస్తారు? సంస్కృతి పేరుతో గుళ్లు, గోపురాలు, పూజల చుట్టూ తిరుగుతున్న మహిళ, ఎలా చైతన్యవంతు రాలవుతుంది? అని ఆలోచించిన వారులేరుకదా! మోదీజీ తననుతాను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని ఊరికే అనడంలేదు. అందుకు ఎన్నో ఉదాహరణలివ్వొచ్చు. ఆయనే చెప్పిన మరో విషయం కూడా గమనించండి. 1964లో మరణించిన నెహ్రూ 1980లో పుట్టిన బీజేపీని చూసి వణికిపోయారట! ఆయన చరిత్ర పరిజ్ఞానానికీ మనం అబ్బురపడాల్సి వస్తోందికాదా? మన పాలకులు ఆ స్థాయిలో ఉంటే ఏం చేస్తాం? సామాన్యప్రజలు అప్రమత్తులవ్వాలి. వివేకవంతు లవ్వాలి. దేశాన్ని వైజ్ఞానిక యుగంలోకి నడిపే యువశక్తి సామాన్య జనంలోనే ఉంది. దాన్ని వెలికితీయాలి. పనికిరాని మూఢనమ్మకాల్ని కొత్తకొత్త రూపాలతో జనం మీదికి విసిరి వారిని ప్రభావితం చేయాలని చూసే అధినాయకులు చాలామంది ఉంటారు. ఎక్కడికక్కడ వారి కుతంత్రాల్ని ధ్వంసంచేస్తూ, వాస్తవ దృక్కోణంలోంచి విషయాల్ని విశ్లేషించుకుంటూ, యువశక్తి ఒక వెల్లువలా రావాల్సిన అవసరం ఉంది! తప్పదు!!

వ్యాస రచయిత కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు

ఇందిరాగాంధీకి జాతి ఘన నివాళి

న్యూదిల్లీ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 105వ జయంతి సందర్భంగా భారత జాతి ఆమెకు శనివారం ఘన నివాళి అర్పించింది. ఇందిరాగాంధీని స్మరించుకుంటూ ప్రధాని నరేంద్రమోదీ ట్వీట్ చేశారు. మన మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇందిర సమాధి శక్తిస్థల్ వద్ద పుష్పాంజలి ఘటించారు. పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు శక్తిస్థల్‌ను సందర్శించి నివాళి అర్పించారు. జీవితకాల పోరాటానికి ఇందిర ఓ ఉదాహరణ అని, అత్యంత ధైర్యశాలి, సమర్థవంత నాయకత్వానికి నిలువెల్ల నిదర్శనమని ఖడ్గే పేర్కొన్నారు. భారతదేశ సమగ్రత, సమైక్యత, పరిరక్షణ కోసం ఆమె ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. దేశం కోసం ఆమె జీవితాన్ని అంకితమిచ్చారని కొనియాడారు. ఆమె రాజకీయ నిబద్ధతను భారతీయులు గుర్తించుకోవాలని సూచించారు. భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్‌గాంధీ సైతం ఇందిరకు నివాళి అర్పించారు. ఆమె జీవితానికి సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశారు. తన నాయనమ్మ ఇందిరతో కలిసి దిగిన ఫొటోను బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

ప్రోత్సాహక వేతనం పెంపు కోరుతూ విద్యార్థుల నిరశన

న్యూదిల్లీ: సౌత్ ఏసియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు తమ ప్రోత్సాహక వేతనం పెంపు డిమాండ్ చేస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్లు విద్యార్థి సంఘం తెలిపింది. నవంబర్ 7 నుంచి నిరశన దీక్ష జరుగుతుడగా, తమ డిమాండ్‌లకు పాలక వర్గం స్పందించలేదని పేర్కొంది. విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా పాలకవర్గం తమతో మాట్లాడే ప్రయత్నం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంఏ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచాలని, కోవిడ్ ప్రభావిత పీహెచ్‌డీ బ్యాచ్‌కు పొడిగింపు ఇవ్వాలని, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కింద పీహెచ్‌డీ స్కాలర్‌లకు చెల్లించే స్టైఫండ్‌తో సమానంగా ఉండేలా చూడాలని, యూనివర్సిటీ ఫిర్యాదుల కమిటీలో ప్రాతినిధ్యం ఉండాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

జార్ఖండ్‌లో రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

రాంచీ: జార్ఖండ్‌లోని వందలాది మంది ప్రాథమిక ఉపాధ్యాయులు స్థానిక వీధుల్లో నిరసన తెలిపారు. వారికి సంబంధించిన నాలుగు డిమాండ్లు, సవరించిన హామీ పొందిన కెరీర్ ప్రోగ్రెషన్ స్కీమ్ ప్రయోజనం, ఎంట్రీ-లెవల్ చెల్లింపుల్లో క్రమరాహిత్యాన్ని తొలగించడం వంటివి ఉన్నాయి. అధ్యాపకులను బోధనేతర పనుల్లో నిమగ్నం చేయడాన్ని నిరసిస్తూ, ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు. అఖిల్ జార్ఖండ్ ప్రాథమిక శిక్షక్ సంఘ్ (ఏజేపీఎస్ఎస్) బ్యానర్‌లో, ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు రాంచీలోని మొరాబాది గ్రౌండ్‌లో సమావేశమై సీఎం సభ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ప్రాథమిక ఉపాధ్యాయులను అధికారులు మధ్యలోనే అడ్డుకున్నారు. "ఇది ముందే షెడ్యూల్ చేసిన కార్యక్రమం. కానీ సీఎం సభకు వెళ్లేందుకు అధికారులు అనుమతించలేదు. రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతిస్తామని గతంలోనే చెప్పాం" అని ఏజేపీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి రామ్‌మూర్తి ఠాకూర్ తెలిపారు. ఏజేపీఎస్ఎస్ ప్రతినిధి నసీమ్ అహ్మద్ మాట్లాడుతూ నవంబర్ 4న తమ నాలుగు అంశాల డిమాండ్‌కు మద్దతుగా దశల వారీగా ఆందోళనలు ప్రారంభించామన్నారు. "మేం ఇతర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఎంఏసీపీ ప్రయోజనాలను కోరుకుంటున్నాం.

సావర్కర్ పెన్షన్ ఎందుకు తీసుకున్నారు

కాంగ్రెస్ నేత నానా పటోల్ ప్రశ్న

బుల్ధానా: హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌పై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తున్న పెద్దలు...బ్రిటీష్ పాలకుల నుంచి ఆయన రూ.60 పెన్షన్ ఎందుకు తీసుకున్నారో వివరించాలని కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోల్ శనివారం డిమాండ్ చేశారు. బ్రిటిషర్లకు సావర్కర్ సహాయపడ్డారని, వారి నుంచి క్షమాభిక్ష కోరుకున్నారని భారత్ జోడో యాత్రలో భాగంగా మహారాష్ట్రలో అడుగుపెట్టిన వెంటనే రాహుల్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. 'సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యలకుగాను కొంతమంది రాహుల్‌గాంధీని విమర్శిస్తున్నారు. సావర్కర్ బ్రిటీషర్లకు సహకరించకపోతే రూ.60 పెన్షన్ ఎలా పొందారు. ఆ పెద్దలు దీనికి సమాధానం చెప్పితీరాలి' అని పటోల్ డిమాండ్ చేశారు. రాహుల్ వ్యాఖ్యల నేపథ్యంలో శివసేన, కాంగ్రెస్ మధ్య బంధం తెగిపోతుందా అని అడిగిన ప్రశ్నకు పటోల్ పైవిధంగా సమాధానం చెప్పారు. మహారాష్ట్రలో భారత్ జోడో యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ ఐక్యంగా, శక్తివంతంగా కనిపిస్తోంది. సైద్ధాంతిక చర్చ జరగాలని, ప్రజలను ఏకం చేయాలని తమ పార్టీ కోరుకుంటున్నదని పటోల్ చెప్పారు. అహింసా సిద్ధాంతాన్ని తమ పార్టీ విశ్వసిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ రైతుల ప్రతిఘటనతో మూడు సాగు చట్టాలను ప్రధాని నరేంద్రమోదీ వెనక్కి తీసుకున్న నవంబరు 19వ తేదీని కిసాన్ విజయ్ దివస్‌గా తమ పార్టీ జరిపిందని చెప్పారు. నవంబరు 19 చారిత్రక దినమని, దీనిని తమ పార్టీ దేశవ్యాప్తంగా కిసాన్ విజయ్ దివస్‌గా నిర్వహించిందని జైరాం రమేశ్ చెప్పారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో నీటిపారుదల సదుపాయాలు పెంచడమే రైతుల సంక్షేమానికి శాశ్వత పరిష్కారమని ఆయన అన్నారు.

తీహార్ జైలులో ఆప్ మంత్రి జైన్‌కు మసాజ్

సీసీటీవీ దృశ్యాలు విడుదల చేసిన బీజేపీ

న్యూదిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మంత్రి సత్యేందర్ జైన్‌కు తీహార్ జైలులో ప్రత్యేక వసతులు కల్పిస్తున్న సీసీటీవీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతున్నాయి. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆయనకు తీహార్ జైలు సెల్‌లో మసాజ్ చేస్తున్నారని ఆరోపించిన బీజేపీ... దీనికి సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేసింది. బీజేపీకి చెందిన అనేక మంది నేతలు వీటిని ఇంటర్‌నెట్‌లో షేర్ చేసి విమర్శలు చేస్తున్నారు. ఆ వీడియోలో సత్యేందర్ జైన్‌కు మసాజ్ చేసినట్లు కనిపిస్తోంది. ఓ వ్యక్తి ఆయన కాళ్లకు నూనె రాసి మసాజ్ చేశాడు. తర్వాత నలుగురైదుగురు జైలు గదిలోకి వచ్చి జైన్‌తో మాట్లాడిన దృశ్యాలు కనిపించాయి. జైలులో జైన్‌కు వీఐపీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఇటీవల ఆరోపణలు వచ్చిన క్రమంలోనే ఇవి బయటకు వచ్చాయి. బీజేపీ నేత షెహజాద్ పూనావాలా శనివారం ఇచ్చిన ట్వీట్‌లో, సత్యేందర్ జైన్ శిక్షకు బదులుగా జైలులో సంపూర్ణంగా వీవీఐపీ మజాను అనుభవిస్తున్నారా? అని ప్రశ్నించారు. తీహార్ జైలులో మసాజ్ చేయడమా? అని నిలదీశారు. హవాలా ఆరోపణలు ఎదుర్కొంటున్న, ఐదు నెలలపాటు బెయిలు పొందని వ్యక్తి హెడ్ మసాజ్ చేయించుకుంటున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ అధికార పరిధిలోని జైలులో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపించారు. వసూళ్ల కోసం, మసాజ్ కోసం అధికార పదవులను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ కారణంగానే జరుగుతోందన్నారు. అన్ని నిబంధనలను చెత్తబుట్టలోకి విసిరేశారన్నారు. జైలులో వీవీఐపీ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారని, కేజ్రీవాల్ ఈ మంత్రిని సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఆ మంత్రిని పదవి నుంచి తొలగించవద్దా? అని ప్రశ్నించారు. ఇది ఆ పార్టీ నిజస్వరూపాన్ని బయటపెడుతోందని చెప్పారు. ఇదిలాఉండగా, బీజేపీ శనివారం విడుదల చేసిన వీడియోపై తీహార్ జైలు అధికారులు స్పందిస్తూ, ఇది పాత వీడియో అని చెప్పారు. జైన్‌కు సదుపాయాలు కల్పించిన అధికారులు, సిబ్బందిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. జైన్‌కు వీవీఐపీ సదుపాయాలు కల్పిస్తున్నారనే ఆరోపణలు రావడంతో తీహార్ జైలు సూపరింటెండెంట్ అజిత్ కుమార్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు.

వెన్నెముక గాయం వల్లే జైన్‌కు ఫిజియోథెరపీ : సిసోడియా

తీహార్ జైలు నుంచి ఆప్ మంత్రి సత్యేందర్ జైన్ వీడియోలను బీజేపీ లీక్ చేసిందని దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా శనివారం ఆరోపించారు. అతను వెన్నెముకకు గాయం కోసం ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారని తెలిపారు. కాషాయ పార్టీ చౌకబారు నాటకాలకు పాల్పడుతోందని అన్నారు. మనీలాండరింగ్ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న జైన్ జైలులో పడిపోయారని అన్నారు. 'అతను (జైన్) అతని వెన్నెముకకు గాయం కావడంతో రెండు శస్త్రచికిత్సలు కూడా చేయించుకున్నాడు. డిశ్చార్జ్ అయిన తర్వాత డాక్టర్ ఫిజియోథెరపీకి సలహా ఇచ్చాడు. ఆ వీడియోలు అతనికి ఫిజియోథెరపీ తీసుకుంటున్నట్లు చూపిస్తున్నాయి' అని వివరించారు. తన సహచర మంత్రి పై తప్పుడు కేసు పెట్టారని, జైన్ అనారోగ్యం పై బీజేపీ ఎగతాళి చేస్తోందని సిసోడియా అన్నారు. 'వారు (బీజేపీ) ఎంసీడీ, గుజరాత్ ఎన్నికలలో ఓడిపోతున్నారు. అందుకే వారు ఇటువంటి చౌకబారు నాటకాలను ఆశ్రయిస్తున్నారు. దిల్లీలో జరిగే ఎంసీడీ ఎన్నికల్లో సమస్యలపై పోరాడాలి' అని అన్నారు.

జైన్ పాద మసాజ్ వీడియోపై కాంగ్రెస్ మండిపాటు

దిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ జైలులో పాదాలకు మసాజ్ చేయించుకుంటున్నట్లు వీడియో వైరల్ కావడంతో కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి అల్కా లాంబా శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పై మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అతనిని పదవి నుంచి ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. వీడియోను ప్రస్తావిస్తూ, ఇది జైలు బ్యారక్‌కు తక్కువగా ఉందని, హోటల్ గదికి ఎక్కువగా ఉందని లాంబా అన్నారు. జైన్‌కు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో, 'అతనిపై సుకేష్ చంద్రశేఖర్ చేసిన ఆరోపణలు నిజమని తేలిందని' లాంబా ఆరోపించారు. వాటిపై విచారణ జరిపించాలని ఆమె అన్నారు.

కొత్త ఈసీగా అరుణ్ గోయల్

న్యూదిల్లీ: నూతన ఎన్నికల కమిషనర్‌గా మాజీ ఐఏఎస్ అరుణ్‌గోయల్ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారిక ప్రకటన పేర్కొంది. పంజాబ్ కేడర్ 1985 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అరుణ్ గోయల్‌ను నూతన ఎన్నికల కమిషన్‌గా రాష్ట్రపతి నియమిస్తున్నట్లు కేంద్ర న్యాయశాఖ ప్రకటించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్ కుమార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉంది. ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించే రోజు నుంచి గోయల్ నియామకం అమల్లోకి వస్తుందని న్యాయశాఖ వెల్లడించింది. కాగా, సీఈసీ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండేతో పాటు గోయల్ ఎన్నికల ప్యానల్‌లో భాగమవ్వనున్నారు. ఈ ఏడాది మేలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా సుశీల్ చంద్ర పదవీ విమరణ పొందారు. ఆయన స్థానంలో రాజీవ్ కుమార్ సీఈసీగా బాధ్యతలు చేపట్టారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై అనర్హతకు డిమాండ్లతో పాటు అనేక కీలక అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత ఎన్నికల ప్యానల్‌కు ఉంటుంది.

మా ఇళ్లు-భూములివ్వం

- 'మాండౌరీ' ప్రాజెక్టు ఉపసంహరించుకోవాలి
- ఆజంగఢ్‌లోని బాధిత గ్రామాల ప్రజల డిమాండు
- నేడు భూమి-ఇల్లు పరిరక్షణ పాదయాత్రకు పిలుపు
- 38వ రోజుకు నిరసన - ఎస్‌కేఎం సహా రైతు సంఘాల మద్దతు

లక్నో: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తమ ఇల్లు-సారవంతమైన భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తోందని ఆజంగఢ్‌లోని గ్రామాల ప్రజలు విమర్శించారు. అజంగఢ్‌లో మాండౌరీ ఎయిర్‌స్ట్రిప్ ప్రతిపాదిత విస్తరణకు వ్యతిరేకంగా నిరసనబాట పట్టారు. జమువా హరిరామ్ సమీపంలోని ఖిరియా కా బాగ్ వద్ద నిరసన శనివారానికి 38వ రోజుకు చేరుకుంది. తమ ఆందోళనను తీవ్రతరం చేయనున్నట్లు నిరసనకారులు ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివారం 'జమీన్ మకాన్ బచావో పాదయాత్ర' (భూమి ఇల్లు పరిరక్షణ పాదయాత్ర)కు బాధిత గ్రామాలు సన్నద్ధమయ్యాయి. వందలాది మంది స్థానికులతో పాటు ఎస్‌కేఎం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటం ఆగబోదని నిరసనకారులు తేల్చిచెప్పారు. ఆందోళనలో రైతులతో పాటు దళితులు, ఓబీసీలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. తమ భూమినిగానీ, జీవనోపాధినిగానీ వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర-జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉండటం వల్ల ఈనెల 26న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు కార్యకర్తలు, రైతు సంఘాల నేతలు తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఏ ప్రతినిధి కూడా నిరసన తెలుపుతున్న గ్రామస్తులను ఇప్పటివరకు సంప్రదించలేదు. దీంతో ఎయిర్‌స్ట్రిప్ విస్తరణ ప్రతిపాదనను ఉపసంహరించుకునేంత వరకు ప్రభుత్వ అధికారులతో ఎటువంటి చర్చలు జరిపేది లేదని నిరసనకారులు తేల్చిచెప్పారు. సర్వే సమయంలో దళితులను, మహిళలను వేధించిన అధికారులపై ప్రభుత్వం ఇంకా చర్యలు తీసుకోలేదని, అది జరిగేంత వరకు చర్చలకు అంగీకరించబోమని స్పష్టంచేశారు. రైతుల ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న 'మకాన్ బచావో ఖేత్ బచావో సంయుక్త మోర్చా' సభ్యుడు రాజీవ్ యాదవ్ మాట్లాడుతూ 'వారు (ప్రభుత్వం) ఒక ప్రకటన చేయాలి లేదా కచ్చితమైన అజెండాతో రావాలి లేనిపక్షంలో చర్చలతో సంబంధం లేకుండా నిరసన కొనసాగుతుంది. మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల నిరసన మాదిరిగానే రాబోయే రోజుల్లో మా ఆందోళన ఉగ్రరూపం దాల్చుతుంది' అని హెచ్చరించారు.

వారణాసి, ఖుషీనగర్, గోరఖ్‌పూర్, అయోధ్యతో పాటు లక్నోలో అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నప్పుడు మరొక విమానాశ్రయం ఎందుకని బాధిత గ్రామాల ప్రజలు ప్రశ్నించారు. అంతేకాకుండా కొత్తగా నిర్మించిన పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే వల్ల లక్నో విమానాశ్రయానికి దూరం కూడా అజంగఢ్ నుంచి 2.5 గంటలకు తగ్గింది. జిల్లా నుంచి రెండు గంటల దూరంలోనే వారణాసి విమానాశ్రయం ఉంది. విస్తరణ ప్రాజెక్టు కోసం అత్యంత సారవంతమైన భూమిని ప్రభుత్వం ఎంపిక చేసుకోవడంపైనా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొద్దినెలల్లో ఆందోళన సమసిపోతుందని భావిస్తేగనుక జిల్లా యంత్రాంగం చాలా పొరపడుతున్నట్లే అని సంయుక్త మోర్చా అధ్యక్షుడు రామ్‌నయన్ యాదవ్ అన్నారు. సాగు చట్టాల రద్దు కోసం సాగిన రైతాంగ ఉద్యమం తరహాలోనే తమ పోరాటం చరిత్రాత్మకమవుతుందని తెలిపారు. గ్రామస్తుల ఆందోళనకు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నేతలు రాకేశ్ తికైత్, గుర్నామ్ సింగ్ చదుని, జగ్తార్ సింగ్ బజ్వాతో పాటు సామాజిక కార్యకర్త- నర్మదా బచావో ఆందోళన్ నాయకురాలు మేధాపాట్కర్, కార్యకర్త అరుంధతీ ధురు తదితరులు మద్దతిచ్చారు. అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) నేత భరత్ సింగ్ కూడా సంఘీభావాన్ని ప్రకటించారు. ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద అజంగఢ్ ఎయిర్‌స్ట్రిప్‌ను అంతర్జాతీయ విమానాశ్రయంగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు వల్ల హసన్‌పూర్, కదిపూర్ హరికేష్, జమువా హరిరామ్, జమువా జోల్హా, గడన్‌పూర్ చిందన్ పట్టి, మందూరి జిగిన కరమ్‌పూర్, జెహ్రా పిప్రితో సహా ఎనిమిది గ్రామాల పరిధిలోని సుమారు 600 ఎకరాల భూమికి సంబంధించి 10,000 మంది నిర్వాసితులయ్యే అవకాశం ఉంది. సేకరించే భూమిలో సారవంతమైన వ్యవసాయ భూములున్నాయి.

నామినేషన్ కోసం 'రూ.10 వేల' నాణేల డిపాజిట్

గుజరాత్ ఎన్నికల్లో దినసరి కూలీ పోటీ

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గాంధీనగర్ ఉత్తర నియోజవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహేంద్రభాయ్ పత్నీ డిపాజిట్ కింద రూపాయి నాణేలను చెల్లించారు. రూ.10 వేల విలువైన నాణేలను రెండు సంచుల నిండా నింపి ఎన్నికల అధికారులకు అందజేశారు. ఇలా ఎందుకు చేశారని ప్రశ్నించగా... తను ఓ దినసరి కూలీనని, ఉండడానికి ఇల్లు, తాగునీటి సదుపాయం కూడా లేదని చెప్పారు. తనలాంటి కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, వారందరి కష్టాలు తీర్చేందుకు తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పడంతో ఇరుగుపొరుగు వారు అంగీకరించారని, ఎవరెవరు తనకు ఓటు వేస్తారని మాటిచ్చారో వాళ్ల నుంచి ఒక్కో రూపాయి సేకరించి డిపాజిట్ కింద చెల్లించానని తెలిపారు. గాంధీనగర్‌లోని రైల్వేస్టేషన్ సమీపంలో లీలా హోటల్ నిర్మాణం కోసం ఇటీవల తమ ఇళ్లను కూలగొట్టారని, దీంతో దాదాపు 521 కుటుంబాలు రోడ్డునపడ్డాయని, అందులో తమ కుటుంబం ఒకటని మహేంద్రభాయ్ ఆవేదనతో చెప్పారు. ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని వాపోయారు. ఇలాంటి కుటుంబాలు నియోజకవర్గ పరిధిలో చాలా ఉన్నాయని, వారందరికీ న్యాయం చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. తనకు ఎలాంటి స్థిర, చరాస్తులు లేవని తన అఫిడవిట్‌లో వెల్లడించారు. ఇప్పటి వరకు తనకు బ్యాంకు ఖాతా కూడా లేదని, ఎన్నికల్లో పోటీ చేసిన వారికి బ్యాంకు ఖాతా తప్పనిసరైనందువల్ల జీరో బ్యాలెన్స్ బ్యాంక్ ఖాతా తెరిచినట్లు ఆయన చెప్పారు. గాంధీనగర్ స్టేషన్‌రోడ్డులో ఓ పూరిగుడిసెలో తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు ఆడపిల్లలతో కలిసి జీవిస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్ ఉత్తర నియోజవర్గానికి మహేంద్రభాయ్‌తోపాటు 28 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రెండో విడతగా డిసెంబరు 5న ఇక్కడ పోలింగ్ జరగనుంది.

దేశ తొలి పురుష - స్త్రీవాది అంబేద్కర్

కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్

పనాజి : భారతదేశపు మొట్టమొదటి పురుష స్త్రీవాది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, అటువంటి ఆలోచనలను దశాబ్దాల క్రితమే ప్రచారం చేశారని, ఇది ప్రస్తుత తరం రాజకీయ నాయకులకు కూడా ప్రగతిశీలమైనదిగా పరిగణించబడుతుందని కాంగ్రెస్ నాయకుడు, రచయిత శశి థరూర్ శనివారం ఇక్కడ అన్నారు. గోవా హెరిటేజ్ ఫెస్టివల్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఆయన (అంబేద్కర్) బహుశా భారతదేశపు మొదటి పురుష స్త్రీవాది. 1920, 30, 40 దశకాల్లో ఆయన మహిళా ప్రేక్షకుల ముందు ప్రసంగాలు చేశారు. ఈ రోజు ఒక పురుష రాజకీయవేత్తకు ప్రగతిశీలమైనదిగా పరిగణించబడుతుంది' అని కాంగ్రెస్ ఎంపీ తన తాజా పుస్తకం 'అంబేద్కర్: ఎ లైఫ్' గురించి మాట్లాడుతూ అన్నారు. 'ఆయన (అంబేద్కర్) మహిళలు బలవంతంగా వివాహాలు చేసుకోవద్దని, మహిళలు వివాహం ఆలస్యం చేయాలని, ప్రసవం ఆలస్యం చేయాలని ఆయన కోరారు. తమ భర్తలతో సమానంగా నిలవాలి' అని తిరువనంతపురం ఎంపీ అన్నారు. అంబేద్కర్ ఒక శాసనసభ్యుడిగా మహిళా కార్మికులు, కార్మికుల కోసం పోరాడారని పేర్కొంటూ, 80-90 సంవత్సరాల క్రితం ఈ వ్యక్తి గొప్ప స్త్రీవాద ఆలోచన ఇదని అన్నారు. 'అంబేద్కర్‌ను దళిత నాయకుడిగా చూసే ధోరణి ఉంది. ఆయన దేశంలోని ప్రధాన దళిత నాయకుడు. తన 20వ ఏట నుంచి ఆయన ఒక ప్రభావవంతమైన గొంతు, మరింత ప్రభావవంతంగా మారాడు' అని వివరించారు. అంబేద్కర్ ఒక అసాధారణ రాజ్యాంగవేత్త, ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా ఉన్నారు. రాజ్యాంగంలోని ప్రతి ఒక్క అంశాన్ని సమర్పించి, సమర్థించిన వ్యక్తి ఆయనే అని థరూర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశం ప్రతిష్ఠ పై అడిగిన ప్రశ్నకు థరూర్ స్పందిస్తూ, 1975లో అమెరికాలో దేశ ప్రతిష్ఠ భయంకరంగా ఉందని అన్నారు. 'ఇది పేద దేశంగా పరిగణించబడింది. అయితే అక్కడ నుంచి పరివర్తన ఆశ్చర్యకరంగా ఉంది. సహస్రాబ్ది నాటికి, మీరు భారతీయ సాఫ్ట్‌వేర్ విప్లవాన్ని కలిగి ఉన్నారు. అకస్మాత్తుగా భారతీయులను కంప్యూటర్ గీక్‌లుగా ఊహించడం ప్రారంభించారు' అని చెప్పారు. 'వై2కె' దృగ్విషయం భారతదేశ కంప్యూటర్ నిపుణులకు ఒక మలుపు అని థరూర్ అన్నారు. 'అన్ని కంప్యూటర్లు క్రాష్ అవుతాయనే భయం ఉంది. అకస్మాత్తుగా ఆ సమస్యను అధిగమించడానికి భారతీయులు కోడ్‌లు చేయడం కోసం మాకు డిమాండ్ వచ్చింది.

కళ్లద్దాలు మార్చుకోండి

- విపక్షాలపై నరేంద్రమోదీ ఎదురుదాడి
- అరుణాచల్‌ప్రదేశ్‌లో విమానాశ్రయం, జల విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభం

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని డోనీ పోలో విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. హోలింగిలో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంతో ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటక రంగం మరింత అభివృద్ధి కానుంది. దీనితో అరుణాచల్‌ప్రదేశ్‌కు ఇతర భారతీయ నగరాలకు వాణిజ్య విమానాలు తిరగడానికి అవకాశం ఏర్పడింది. మరోవైపు, పశ్చిమ కెమాంగ్ జిల్లాలో 600 మెగావాట్ల కెమాంగ్ జల విద్యుత్ ప్రాజెక్టును మోదీ జాతికి అంకితం చేశారు. 80 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రూ.8,450 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. దీంతో అరుణాచల్‌ప్రదేశ్ అదనపు విద్యుత్ రాష్ట్రంగా మారుతుందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ విమానాశ్రయ నిర్మాణంపై గతంలో విపక్షాలు చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. ప్రతి విషయాన్ని ప్రతిపక్ష నాయకులు ఎన్నికల దృష్టితోనే చూస్తున్నాయని, అలాంటి వాళ్లు పాత కళ్లద్దాలు మార్చుకోవాలని ఆయన సూచించారు. మూడేళ్ల క్రితం డోనీ పోలో విమానాశ్రయానికి శంకుస్థాపన చేసినప్పుడు ఓటు బ్యాంకు రాజకీయాలని మోదీపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈ విమర్శలకు మోదీ తాజాగా స్పందిస్తూ 2019 ఫిబ్రవరిలో ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేశానని, 2019 మేలో ఎన్నికలు ఉండటంతో విమర్శకులు గగ్గోలు పెట్టారని అన్నారు. ప్రతీదీ పాత కళ్లద్దాలతో చూడటం అలవాటు ఉన్న విమర్శకులు...కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే మోదీ ఇక్కడకు వచ్చారని, ఎప్పటికీ విమానాశ్రయ నిర్మాణం జరగదని విమర్శించినట్టు గుర్తుచేశారు. ప్రతి కార్యక్రమానికి రాజకీయ రంగు పులిమే అలవాటు ఉన్న వారికి ఇప్పుడు విమానాశ్రయం ప్రారంభం కావడం చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. పాత కళ్లద్దాలు తొలగించాలని విమర్శకులకు చెప్పదలచుకున్నానన్నారు. రెట్టించిన ఉత్సాహంతో దేశం ప్రగతి పథం వైపు దూసుకెళ్తోందని, ఇప్పటికైనా ప్రతి విషయానికి రాజకీయ రంగు పులమడం మానుకోవాలని హితవు పలికారు. 690 ఎకరాల విస్తీర్ణంలో రూ.640 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసింది. గంటకు 200 మంది ప్రయాణికులను హ్యాండిల్ చేయగలిగే ఎనిమిది చెక్‌ఇన్ కౌంటర్లు నిర్మించారు. 2300 మీటర్ల రన్‌వే ఉంది. బోయింగ్ 747 విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనుకూలంగా విమానాశ్రయాన్ని నిర్మించారు. డోనీ పోలో ఎయిర్‌పోర్ట్‌తో అరుణాచల్‌ప్రదేశ్‌లో మొత్తం మూడు విమానాశ్రయాలు అందుబాటులోకి రాగా, ఈశాన్య రాష్ట్రాల్లో విమానాశ్రయాల సంఖ్య 16కు చేరింది.

రాహుల్‌కు పూర్తిస్థాయి భద్రత కల్పిస్తాం: నరోత్తమ్ మిశ్రా

భోపాల్: ఇండోర్‌లో భారత్ జోడో యాత్ర బాంబు పేలుళ్లు జరుగుతాయని బెదిరింపు లేఖ వచ్చిన మరుసటి రోజు, మధ్యప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా శనివారం మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి భద్రత కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. నవంబర్ 28న స్థానిక ఖల్సా స్టేడియంలో భారత్ జోడో యాత్ర జరిగే నగరంలో బాంబు పేలుళ్లు జరుగుతాయని గుర్తు తెలియని వ్యక్తులు లేఖలో బెదిరించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల గురించి ప్రస్తావించిన లేఖలో రాహుల్‌ను, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్‌ను హత్య చేస్తామని కూడా బెదిరించారు. "మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీకి భారీ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. భద్రత కల్పించడం మా నిబద్ధత అని నేను వారికి హామీ ఇవ్వాలనుకుంటున్నాను'అని బెదిరింపు లేఖ గురించి అడిగిన ప్రశ్నకు మిశ్రా విలేకరులకు తెలిపారు. అయితే ఈ నెల ప్రారంభంలో కమల్‌నాథ్ ఖాల్సా స్టేడియంకు వెళ్లి 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలకు కమల్‌నాథ్ ఉప్పు రుద్దారని మంత్రి ఆరోపించారు. "రాహుల్ గాంధీ యాత్ర రాష్ట్రానికి రావడం బహుశా కమల్‌నాథ్ కోరుకోకపోవచ్చు" అని మిశ్రా అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని జూని ప్రాంతంలోని స్వీట్స్-స్నాక్స్ దుకాణంలో అజ్ఞాత బెదిరింపు లేఖ వచ్చిందని ఇండోర్ పోలీసులు శుక్రవారం తెలిపారు. నవంబర్ 8న గురునానక్ జయంతి సందర్భంగా అక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కమల్‌నాథ్‌ను సత్కరించడంపై వివాదం ఏర్పడిన తర్వాత ఇండోర్‌లోని ఖల్సా స్టేడియం ఈ నెల ప్రారంభంలో వార్తల్లో నిలిచింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా కమల్‌నాథ్ స్టేడియంలోకి ప్రవేశిస్తే నల్లజెండాలతో నిరసన తెలుపుతామని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది.

39 పాఠశాలలకు 'స్వచ్ఛ విద్యాలయ పురస్కార్'

న్యూదిల్లీ: 2021-22కు సంబంధించి దేశవ్యాప్తంగా 39 పాఠశాలలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కారం లభించినట్లు విద్యా మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. 8.23 లక్షల ప్రవేశాల నుంచి ఎంపిక చేయబడిన పాఠశాలల్లో 28 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా, 11 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అవార్డు పొందిన పాఠశాలల్లో రెండు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఒక నవోదయ విద్యాలయం, మూడు కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. స్వచ్ఛ విద్యాలయ పురస్కారం నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత రంగంలో ఆదర్శప్రాయమైన పనిని చేపట్టిన పాఠశాలలను సత్కరించడమే కాకుండా పాఠశాలలకు మరింత మెరుగులు దిద్దడానికి సలహాలు, సూచనలు అందిస్తుంది. అవార్డు కోసం, పాఠశాలలు ఆరు విస్తృత విభాగాలను పరిశీలించారు. నీరు, మరుగుదొడ్లు, సబ్బుతో చేతులు కడుక్కోవడం, ఆపరేషన్, నిర్వహణ, ప్రవర్తనా మార్పు, సామర్థ్యం పెంపుదల, కోవిడ్-19 (సన్నద్ధత, ప్రతిస్పందన). "39 పాఠశాలల్లో 17 ప్రాథమిక, 22 మాధ్యమిక/హయ్యర్ సెకండరీ పాఠశాలలు, 34 పాఠశాలలకు (మొత్తం కేటగిరీలో) రూ. 60,000, అవార్డు గ్రహీత పాఠశాలలకు రూ.20,000 (ఉప-కేటగిరీలలో) నగదు బహుమతులు అందించాం"అని విద్యా మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు.

ప్రైవేట్ విమానాలపై నియంత్రణ అవశ్యం

గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి: నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: దేశంలో ప్రైవేట్ విమానాల ద్వారా కోట్లాది రూపాయల అక్రమ ధనాన్ని తరలిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్లపై నిఘాతో పాటు నియంత్రణ పెట్టాలని డిమాండ్ చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. మునుగోడు ఎన్నికలో పట్టుబడిన 700 కోట్ల రూపాయలు ధనమే అక్రమ రవాణాకు నిదర్శనమని నారాయణ చెప్పారు. క్యాసినో నిర్వాహకుడు చికోటి ప్రవీణ్ వంటి వ్యక్తులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దేశంలో టెర్రరిజాన్ని నియంత్రిం చలేని ప్రధాని మోదీ... అంతర్జాతీయ వేదికలపై ఉగ్రవాదం గురించి ప్రస్తావించడం సిగ్గుచేటని విమర్శించారు. బ్లాక్ మనీతో దేశ ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందన్నారు. గుజరాత్‌లో హామీల వర్షం కురిపిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోదీ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ పర్యటనలో పదివేల కోట్ల రూపాయల చిన్నచిన్న పనులకు శంకు స్థాపనలు చేసిన మోదీ... అదే విశాఖలో మూడు లక్షల కోట్ల విలువచేసే స్టీల్‌ప్లాంట్ గురించి ప్రస్తావించకపోవడం దారుణమని నారాయణ అన్నారు. ప్రత్యేకహోదా, ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల గురించి కనీసం ప్రస్తావించలేదని మండిపడ్డారు. మోదీతో జరిగిన సమావేశం వివరాలు చెప్పకుండా జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ, బీజేపీ బంధం విడదీయ రానిదన్నారు. మోటార్లకు మీటర్లు బిగించడాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు సైతం వ్యతిరేకిస్తుంటే... జగన్ సర్కారు మాత్రం ఆఘమేఘాలపై అమలు చేస్తోందని విమర్శించారు. వైసీపీయేతర పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని నారాయణ చెప్పారు. టీడీపీని బలహీనపరిచి...తాను బలపడాలని బీజేపీ కుట్రలు చేస్తోందని, ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ గ్రహించాలని హితవు పలికారు. మోదీ సర్కారు సింగరేణిని ప్రైవేట్‌పరం చేయబోమంటూనే...బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నదని మండిపడ్డారు. గవర్నర్ల వ్యవస్థ ద్వారా బీజేపీ యేతర పాలిత రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు నారాయణ ఆరోపించారు. గవర్నర్ల వ్యవస్థను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు విపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పోరాట కార్యాచరణను రూపొందించిందన్నారు. ఈనెల 26న ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం దిల్లీలో ఆందోళన చేపడుతున్నామన్నారు. టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 5న పోరాటం చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

కోశ్యారి వివాదాస్పద వ్యాఖ్యలు

శివాజీ పాతతరం హీరో అన్న మహారాష్ట్ర గవర్నర్

మరాఠా సంఘాల ఖండన - రీకాల్‌కు విపక్షాల డిమాండ్

ముంబై: ఛత్రపతి శివాజీ మహరాజ్ పాత తరానికి హీరో అని, నేటి తరానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నుంచి నితిన్ గడ్కరీ వరకు అనేకమంది స్ఫూర్తిప్రదాతలు ఉన్నారని మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారి వ్యాఖ్యానించారు. ఔరంగాబాద్‌లో స్నాతకోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలతో కొత్త వివాదానికి తెరతీశారు. కోశ్యారి వ్యాఖ్యలను మరాఠా సంఘాలు ఖండించాయి. గవర్నర్ రీకాల్‌కు ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేశారు. 'మేము స్కూల్లో ఉన్నప్పుడు మీకు ఇష్టమైన నాయకులు ఎవరని టీచర్లు అడిగితే సుభాశ్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ పేర్లు చెప్పేవాడిని. మహారాష్ట్రలో ఎవరైనా ఇదే ప్రశ్న అడిగితే బయట వారి పేర్లు చెప్పాల్సిన పనిలేదు. స్థానికంగానే అనేకమంది మహనీయులు ఉన్నారు. శివాజీ పాతతరానికి హీరో. ఇప్పుడు అంబేద్కర్ నుంచి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ వరకు అనేకమంది హీరోలు ఉన్నారు' అని కోశ్యారి అన్నారు. ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌ను తన ప్రసంగంలో ప్రశంసించారు. కోశ్యారి వివాదాస్పద వ్యాఖ్యలను మరాఠా సంఘాలు ఖండించాయి. రాజ్యసభ మాజీ ఎంపీ, శివాజీ వారసుడు ఛత్రపతి సంభాజీరాజే మాట్లాడుతూ, ఆయనను పంపించేయాలని చెబుతూనే ఉన్నా. ముందు ఆ పనిచేయాలని ప్రధాని మోదీని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా' అని అన్నారు. శివసేన (యూబీటీ) నేత అనిల్ దేశాయ్ మాట్లాడుతూ, ఆయన ఇలాగే మాట్లాడతారు. గడ్కరీ, పవార్ గురించి కొత్తగా తెలుసుకొన్నట్లు ఉన్నారు. అందుకే వారి గురించి ప్రస్తావించారు' అని విమర్శించారు. అయితే వివాదాలు సృష్టించడం కోశ్యారికి కొత్తేమీకాదు.

జైలు నుంచి గౌతమ్ నవ్లాఖా విడుదల

ముంబై: ఎల్గార్ పరిషత్, మావోయిస్టులతో సంబంధాల కేసులో నిందితుడైన గౌతమ్ నవ్లాఖా శనివారం సాయంత్రం నవీ ముంబైలోని తలోజా జైలు నుంచి విడుదలయ్యాడు. ఆయన నెల రోజుల పాటు గృహ నిర్బంధంలో ఉంటారు. వెంటనే ఆయనను నవీ ముంబైలోని బేలాపూర్-అగ్రోలి ప్రాంతంలోని ఓ భవనానికి పోలీసు బృందం తీసుకెళ్లింది. నవ్లాఖా సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జైలు నుంచి వెళ్లిపోయారని సీనియర్ జైలు అధికారి తెలిపారు. ఆయన గృహనిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఎన్ఐఏ దాఖలు చేసిన దరఖాస్తును శుక్రవారం మధ్యాహ్నం సుప్రీం కోర్టు తిరస్కరించింది. నవ్లాఖాను 24 గంటల్లో 'తప్పనిసరి'గా గృహనిర్బంధంలో ఉంచాలని ఆదేశించింది.

సావర్కర్... నెహ్రూ లక్ష్యం కాకూడదు

ఎంపీ సంజయ్ రౌత్

ముంబై: వీడీ సావర్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ లేదా మరే ఇతర స్వాతంత్ర్య సమరయోధులు తమను తాము రక్షించుకోవడానికి సజీవంగా లేరని, అందువల్ల వారిని కించపరచవద్దని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ శనివారం అన్నారు. నెహ్రూ లేదా మరే ఇతర చారిత్రక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని సావర్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలను ఎదుర్కోవాల్సిన అవసరం లేదని తెలిపారు. సావర్కర్ గురించి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం లేదని శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం స్పష్టం చేసిన ఒక రోజు తర్వాత రౌత్ ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఇది మహారాష్ట్రలోని కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమిని ప్రభావితం చేయగలదని ఆయన అన్నారు. 'పండిట్ నెహ్రూ, సావర్కర్ ప్రతిష్ఠలను దిగజార్చే ప్రయత్నాలు ఆపాలి. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు ఏ భావజాలానికి లేదా రాజకీయ పార్టీకి చెందినవారు కాదు' అని రాజ్యసభ సభ్యుడు శనివారం అన్నారు. 'సావర్కర్, ఇతర స్వాతంత్ర్య సమరయోధులందరూ మాకు గౌరవనీయులు' అని తెలిపారు. 'ఎవరైనా సావర్కర్‌ను దూషించినంత మాత్రాన, మీరు నెహ్రూ గురించి ప్రతికూలంగా మాట్లాడుతున్నారని అర్థం కాదు' అని శివసేన నాయకుడు అన్నారు. దేశానికి మొదటి ప్రధాన మంత్రిగా నెహ్రూ సావర్కర్ 'శాస్త్రీయ దృక్పథాన్ని' స్వీకరించడం ద్వారా భారతదేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని కూడా అని తెలిపారు. లేకుంటే భారతదేశం మరో పాకిస్థాన్‌గా మారేది... అందుకు నెహ్రూకు భారతదేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు. కాగా, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే శనివారం మాట్లాడుతూ రాహుల్ గాంధీని విమర్శించే వారు మొదట 'హిందుత్వ సిద్ధాంతకర్త బ్రిటీషు వారి నుంచి రూ.60 పెన్షన్ ఎందుకు పొందారో' వివరించాలని అన్నారు.

ఇలాగైతే వాకౌట్ చేస్తాం

వాతావరణ చర్చలపై యూరోపియన్ యూనియన్ అసంతృప్తి

షర్మల్ షేక్: అవసరమైతే ఈజిప్టులో కొనసాగుతున్న ఐరాస వాతావరణ సదస్సు నుంచి వాకౌట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని యూరోపియన్ యూనియన్ వాతావరణ కమిషన్ చీఫ్ ఫ్రాన్స్ టిమ్మర్‌మాన్స్ శనివారం తేల్చి చెప్పారు. సదస్సులో ఈజిప్టు ప్రతిపాదన పేలవంగా ఉండటాన్ని దుయ్యబట్టారు. ఒప్పందాన్ని చైనా, సౌదీ అరేబియా బలహీన పరుస్తుంటే ఈజిప్టు వత్తాసు పలుకుతోందని వ్యాఖ్యానించారు. అవసరమైతే వాకౌట్‌కు 13 మంది యూరోపియన్ యూనియన్ మంత్రులు సిద్ధమేనని ఆయనన్నారు. 1.5 డిగ్రీల సెల్సియస్ లక్ష్యాన్ని సజీవంగా ఉంచాలని తేల్చిచెప్పారు. సానుకూల ఫలితం అందుబాటులోనే ఉన్నాగానీ తాజా పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నట్లు ఈయూ పర్యావరణ మంత్రులతో కలిసి విలేకరులతో మాట్లాడిన ఆయనన్నారు. చెడ్డ నిర్ణయం కంటే ఏ నిర్ణయం లేకపోవడమే మంచిదని చెప్పారు. మంచి నిర్ణయం అంటే 1.5 డిగ్రీల సెల్సియస్ లక్ష్యాన్ని చేరుకునే దిశగా కసరత్తుకు అనుకూలంగా చర్యలు ఉండటమని, ఒప్పందాన్ని-లక్ష్యాన్ని నీరుగార్చడం కాదని అసహనం వ్యక్తంచేశారు. చర్చల్లో మరే దేశం కూడా ఈయూ అంత రాజీ పడలేదని, ఈయూ విజన్‌కు ప్రతికూల స్పందన తగిన విధంగా లేదన్నారు. వాతావర ణంలో మార్పుల బాధిత దేశాల కోసం నిధి సమకూర్చేందుకు ఈయూ ప్రతిపాదించిందని, ఇక స్పందించాల్సినది ఇతరులేనని ఆయనన్నారు. 'రెండు నెలల కిందట ఎక్కడ ఉన్నామో గుర్తుతెచ్చుకోండి. దీనిని ఎవ్వరూ అజెండాలో కోరుకోలేదు' అని టిమ్మర్‌మాన్స్ వ్యాఖ్యా నించారు. 'మనం ఇప్పుడు నిధి ఏర్పాటు గురించి మాట్లాడుతున్నాం. అది ప్రతిపాదించినది మేమే. ఇతరులు కూడా సానుకూలంగా స్పందిస్తే సబబుగా ఉంటుంది' అని ఆయన అన్నారు.

మహారాష్ట్రలో కాంగ్రెస్ మహిళల పాదయాత్ర

బుల్దానా: కాంగ్రెస్ పార్టీ శనివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 105వ జయంతిని పురస్కరించుకుని తమ భారత్ జోడో యాత్రతో పాటు మహిళలతో ప్రత్యేక 'పాదయాత్ర'ను నిర్వహించింది. ఇది మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాలోని షెగావ్ నుంచి జలంబ్ వరకు సాగింది. ప్రత్యేక పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఉన్నారు. వారందరూ రంగురంగుల దుస్తులను ధరించారు. తొమ్మిది గజాల చీరను ధరించిన నాగ్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ ఆఫీస్ బేరర్ నఫీసా సిరాజ్ మాట్లాడుతూ 'హిందువులు, ముస్లింలు వేర్వేరు కాదు. ఈ చీర ధరించడం ద్వారా నేను మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాన్ని చూపించాలనుకుంటున్నాను' అని అన్నారు. మరొక మహిళ మాట్లాడుతూ విద్యావంతులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమవుతున్నారని, రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని, ద్రవ్యోల్బణం అందరినీ తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, ప్రస్తుతానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

మారణాయుధాలు స్వాధీనం

న్యూఢిల్లీ: మెహరౌలీ హత్యకేసులో విస్తుపోయే నిజాలు బయట పడుతున్నాయి. సహజీవనం చేస్తున్న శ్రద్ధావాకర్‌ను 35 ముక్కలుగా కోసి హత్య చేసిన అఫ్తాబ్ అమీన్ పూనావాలాకు చెందిన కీలక ఆధారాలను ఢిల్లీ పోలీసులు సేకరించారు. హత్యకు వినియోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అఫ్తాబ్ ఇంట్లో కటింగ్ టూల్స్‌ను కనుగొన్నారు. వీటిని ఉపయోగించే శ్రద్ధను ముక్కలుగా నరికి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అక్టోబర్ 18న అతను ఓ బ్యాగ్‌తో వెళున్న దృశ్యాలను గుర్తించారు. గర్ల్‌ఫ్రెండ్ శ్రద్ధా శరీర భాగాలను పడేసేందుకు అతను ఆ బ్యాగ్‌ను వాడినట్లు అనుమానిస్తున్నారు. బ్యాగ్ వేసుకుని మూడు సార్లు రౌండ్లు కొట్టినట్లు పోలీసులు గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ నిర్ధారణకు వచ్చారు. శ్రద్ధా హత్యకేసులో కీలక ఆధారాల కోసం మెహరౌలీ అడవిలో వరుసగా ఆరో రోజు పోలీసులు వెతికారు. హత్య జరిగిన రోజున తాను డ్రగ్స్ తీసుకున్నట్లు అఫ్తాబ్ పోలీసులకు తెలిపాడు. ఈ కేసులో విచారణ నిమిత్తం పోలీసులు పోలీసులు మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు వెళ్లారు.

కశ్మీరులో జర్నలిస్టులకు ఉగ్రముప్పు

పోలీసుల తనిఖీలు

శ్రీనగర్: జమ్ముకశ్మీరులో జర్నలిస్టులకు ఉగ్రవాదుల నుంచి ప్రాణహాని పొంచి ఉంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టారు. జర్నలిస్టులను చంపేస్తామంటూ ది రెసిస్టెంట్ ఫ్రంట్ అనే ఉగ్ర సంస్థ నుంచి బెదిరింపులు వచ్చాయి. శ్రీనగర్, అనంతనాగ్, కుల్గాం జిల్లాల్లో పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అనేకమంది జర్నలిస్టులు, కొంతమంది అనుమానితుల ఇళ్ల సహా ఉగ్రవాదుల కోసం తనిఖీలు చేసినట్లు వివరించారు. కొంతమందిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. కశ్మీరులో జర్నలిస్టులకు ఉగ్రవాదుల నుంచి బెదిరింపు లేఖలు రావడంతో నవంబరు 12న లష్కరే తోయిబా, ది రెసిస్టెంట్ ఫ్రంట్‌కు చెందిన తీవ్రవాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఒక్క రోజే 12 ప్రాంతాల్లో తనిఖీలు చేసినట్లు అధికారులు వివరించారు. సజ్జద్ గుల్, ముక్తార్ బాబా వంటి ఉగ్రవాదుల నివాసాలు, ఇతర అనుమానితుల ఇళ్లలోనూ తనిఖీలు చేశామని చెప్పారు. టర్కీ కేంద్రంగా నడిచే ఉగ్రవాద సంస్థ తీవ్రవాది బాబా, ఆయనతో సంబంధం గల మరో ఆరుగురి నుంచి బెదిరింపు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, మెమరీకార్డులు, పెన్ డ్రైవ్‌లు, ఇతర పేలుడు పదార్థాలు, బ్యాంక్ పత్రాలు, రబ్బర్ స్టాంపులు, పాస్‌పోర్టులు, నగదు, కొంత సౌదీ కరెన్సీని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

త్వరలో కొత్త సెలెక్షన్ కమిటీ

ప్రస్తుత కమిటీ రద్దు... కొత్త కమిటీ కోసం నోటీసు జారీ

కోల్‌కతా: కొత్త అధ్యక్షుడు రోజర్ బిన్నీ నేతృత్వంలోని భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) కీలక నిర్ణయాలు తీసుకొనేందుకు సిద్ధమైంది. టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్‌లోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. దీంతో సెలెక్షన్ కమిటీలో తీవ్ర మార్పులు చేసేందుకు బీసీసీఐ నడుం బిగించింది. అందులో భాగంగా చేతన్ శర్మ చైర్మన్‌గా ఉన్న సెలెక్షన్ కమిటీని రద్దు చేసింది. ఇందులో ఇప్పటి వరకు హర్విందర్ సింగ్, సునీల్ జోషీ, దేబశిష్ మొహంతి సభ్యులు. సెలెక్షన్ కమిటీ చైర్మన్ సహా నూతన సభ్యుల నియామకం కోసం బీసీసీఐ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 28వ తేదీ వరకు గడువు విధించింది. ఈ క్రమంలో తాజాగా సభ్యుల ప్రధాన బాధ్యతలపై బీసీసీఐ ఎనిమిది పాయింట్లతో కూడిన జాబితాను విడుదల చేసింది. న్యాయంగా, పారదర్శక పద్ధతిలో అత్యుత్తమ జట్టును ఎంపిక చేయాలి, సీనియర్ పురుషుల టీమ్ రిజ్వర్ బెంచ్‌ను బలోపేతం చేయడంపై దృష్టిపెట్టాలి. దానికి తగ్గట్లు ప్రణాళికలు తయారు చేయాలి. అవసరమైన సందర్భంలో జట్టు సమావేశాలకు హాజరు కావాలి. దేశీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లను గమనించేందుకు ప్రయాణాలు చేస్తూ ఉండాలి. ఆటగాళ్ల, జట్టు ప్రదర్శనపై ప్రతి మూడు నెలలకోసారి నివేదికలు రూపొందించి బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు సమర్పించాలి. జట్టు ఎంపికపై, బీసీసీఐ ఆదేశాల మేరకు మీడియాతో మాట్లాడాలి. ప్రతి ఫార్మాట్‌కు సరైన నాయకుడిని నియమించాలి. బీసీసీఐ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలి.

సభ్యులకు ఉండాల్సిన అర్హతలు

కనీసం 7 టెస్టు మ్యాచ్‌లు లేదా 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు లేదా 10 వన్డేలు, 20 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. క్రికెట్‌కు వీడ్కోలు పలికి దాదాపు ఐదేళ్లు పూర్తి కావాలి. ఐదుగురు సభ్యులకు వయసు పరిమితి 60 ఏళ్లలోపు వారికే అవకాశం. మొత్తం 5 సంవత్సరాల పాటు ఏదైనా క్రికెట్ కమిటీలో సభ్యుడిగా ఉన్న వ్యక్తి దరఖాస్తు చేసుకొనేందుకు అనర్హుడు.

అద్భుతమైన ఐడియాతో 'ఆర్ఆర్ఆర్2'



హైదరాబాద్: దర్శకధీరుడు ఎస్ఎస్. రాజమౌళి తెరకెక్కించిన సినిమా 'ఆర్ఆర్ఆర్'. రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ హీరోలుగా నటించారు. ఈ చిత్రం పాన్ ఇండియాగా రూపొందింది. అనేక భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.1200కోట్లకు పైగా కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది. థియేటర్‌లో చిత్రాన్ని చూడలేని వారందరూ ఓటీటీలో వీక్షిస్తున్నారు. ఈ సినిమాకు విదేశీ ప్రేక్షకుల నుంచి కూడా అద్భుతమైన స్పందన వస్తోంది. హాలీవుడ్‌కు చెందిన అనేక మంది ఈ చిత్రాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. ఫలితంగా ఈ చిత్రం ఆస్కార్ బరిలో నిలిచింది. అకాడమీ పురస్కారాల కోసం అనేక కేటగిరీల్లో పోటీపడుతోంది. ఈ నేపథ్యంలో అమెరికాలో తాజాగా 'ఆర్ఆర్ఆర్' స్క్రీనింగ్‌ను ఏర్పాటు చేశారు. మూవీ పూర్తయిన అనంతరం క్వశ్చన్ అండ్ అన్సర్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్‌లో జక్కన్న పాల్గొన్నాడు. 'ఆర్ఆర్ఆర్' సీక్వెల్‌పై మరోసారి క్లారిటీ ఇచ్చాడు. అద్భుతమైన ఐడియాతో సీక్వెల్ తెరకెక్కుతుందని చెప్పాడు.

సుమన్‌కు 'కత్తుల కాంతారావు' అవార్డ్

హైదరాబాద్: పాతతరం నటుడు, నిర్మాత, దర్శకుడు కీర్తి శేషులు కాంతారావు 100 జన్మ సంవత్సరం ఇప్పుడు నడుస్తోంది. కాంతారావుని కత్తుల కాంతారావు అని కూడా అంటా రు, ఎందుకంటే అతను జానపద సినిమాల్లో కత్తితో చేసే విన్యాసాలు అలా ఉంటాయి. ఆయన శత జయంతి సంవత్సరం సందర్భంగా ఆకృతి సంస్థ కాంతారావు పేరు మీద అవార్డు ఇవ్వాలని సంకల్పించింది. ఏటా కాంతారావు పేరు మీద ఈ అవార్డు ఫంక్షన్ జరపాలని కూడా నిర్ణయించింది. మొదటి అవార్డును సీనియర్ నటుడు సుమన్ కి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ అవార్డుకి సుమన్ అత్యంత సమర్థుడని భావించి అతనికి ఈ అవార్డు ఇస్తున్నట్టు ప్రకటించారు. త్వరలో ఆ అవార్డు ఇచ్చే తేదీని ప్రకటిస్తామని చెప్పారు. ఒక ఫంక్షన్ ఏర్పాటు చేసి, ఈ అవార్డు బహూకరణ ఉంటుందని, దానికి సినిమా పరిశ్రమ నుంచి చాలామంది హాజరు అవుతారని కూడా చెప్పారు. ప్రముఖ దర్శకుడు, నిర్మాత అయిన తమ్మారెడ్డి భరద్వాజ ఈ అవార్డుని శనివారం ఫిల్మ్ ఛాంబర్ బిల్డింగ్ ఆఫీసులో జరిగిన ఒక సభలో ప్రకటించారు.

విశాలాంధ్ర లీల

డిసెంబర్ 8న 'ఎన్‌బీకే108'కి ముహూర్తం

హైదరాబాద్: బాలకృష్ణ తన తర్వాత చిత్రం దర్శకుడు అనిల్ రావిపూడితో చేయనున్నారు. వర్కింగ్ టైటిల్‌గా 'ఎన్‌బీకే108' అని పెట్టారు. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్ నిర్మించనుంది. 'ఎన్‌బీకే108' పూజా కార్యక్రమానికి బాలయ్య ముహూర్తం ఫిక్స్ చేశారని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. 'ఎన్‌బీకే108' ప్రాజెక్టు అధికారికంగా డిసెంబర్ 8న పూజా కార్యక్రమాలు జరుపుకోనుందని సమాచారం. పవర్ ఫుల్ కథతో ఈ చిత్రం రూపొందుతోందని తెలుస్తోంది. అర్జున్ రెడ్డి తరహాలోనే బాలకృష్ణ మూవీ పూర్తిగా క్యారెక్టరైజేషన్ ఆధారంగా కొనసాగుతుందట. బాలయ్య తండ్రి పాత్రలో కనిపించనున్నారని టాక్. ఆయన కుమార్తె పాత్రకు చిత్రంలో ఎంతో ప్రాధాన్యం ఉందట. ఆ రోల్‌లో యువనటి శ్రీలీల కనిపించనుంది. బాలీవుడ్‌కు చెందిన అనేకమంది ఈ సినిమాలో నటించనున్నారని ప్రచారం జరుగుతోంది. విలన్ పాత్రలో నటించడానికి అర్జున్ రాంపాల్ ఇప్పటికే ఒకే చెప్పారట. హీరోయిన్‌గా బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా నటించనుందని సమాచారం. విభిన్న కథాంశంతో తెరకెక్కుతుండటంతో చిత్రంపై భారీ అంచనాలున్నాయి.

అరుదైన రికార్డుకు చేరువగా భువీ

కోల్‌కతా: న్యూజిలాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ వర్షార్పణం అయిన సంగతి తెలిసిందే. ఆదివారం మౌంట్ మాంగనుయ్ వేదికగా రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం కివీస్ పర్యటనలో ఉన్న భారత జట్టు బౌలర్లలో అత్యంత సీనియర్ భువనేశ్వర్ కుమార్ మాత్రమే. తుది జట్టులో స్థానం కోసం కుర్రాళ్ల నుంచి విపరీతమైన పోటీ నెలకొంది. మరోవైపు పొట్టి ఫార్మాట్‌లో యువకులకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని మాజీలు, అభిమానులు సూచిస్తున్నారు. దీంతో అందరి కళ్లూ భువీ వైపు మళ్లాయి. కివీస్‌తో జరిగే మిగతా రెండు టీ20ల్లో తుది జట్టులో స్థానం దక్కుతుందా..? లేదా..? అనే సందేహం అందరిలోనూ కొనసాగుతోంది. ఎందుకంటే డెత్ ఓవర్లలో భువీ ప్రదర్శన అద్భుతంగా ఏమీలేదు. భారీగా పరుగులు సమర్పించుకొన్నాడు.

ఇంకో నాలుగు తీస్తే..

టీ20 ఫార్మాట్‌లో భువనేశ్వర్ కుమార్ మరో అరుదైన రికార్డుకు చేరువగా ఉన్నాడు. 33 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ (36 వికెట్లు) ప్రస్తుతం సంవత్సరంలో దాదాపు 30 టీ20లు ఆడాడు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 40 వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించేందుకు మరో 'నాలుగు' అడుగుల దూరంలో ఉన్నాడు. ప్రస్తుతం ఐర్లాండ్ బౌలర్ జేబీ లిటిల్ (39) టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అతడు 26 మ్యాచుల్లో 39 వికెట్లు తీశాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ సెమీస్‌లో ఇంగ్లండ్‌పై భువీ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ఆరంభ ఓవర్లలో ప్రభావం చూపే భువనేశ్వర్.. డెత్ ఓవర్లలో తేలిపోతున్నాడని ఇప్పటికే చాలాసార్లు మనం అనుకొన్న విషయం తెలిసిందే. అయితే అతడిని తెలివిగా పవర్‌ప్లే ఓవర్లలోనే వినియోగించుకుంటే మాత్రం జట్టుకు ప్రయోజనకరంగా ఉంటుందని మాజీలు సూచించారు. తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్య ఆ దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. వెల్లింగ్టన్ మైదానం మాదిరిగా మౌంట్ మాంగనుయ్ స్టేడియం చిన్నది కాదు. బౌండరీలు కాస్త పెద్దగానే ఉంటాయి. కాబట్టి స్వింగ్ బౌలర్ భువీ తన అనుభవంతో రాణించే అవకాశం ఉంది.

ఉమ్రాన్‌కు అవకాశం దక్కేనా?

నేడు కివీస్‌తో టీమిండియా రెండో టీ20

మౌంట్ మాంగనీ: భారత్ కివీస్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఆదివారం రెండో టీ20 జరగనున్నది. అయితే ఈ మ్యాచ్‌లో కూడా ఉమ్రాన్ మాలిక్ స్థానంపై సస్పెన్స్ కొనసాగుతోంది. వర్షం పుణ్యమా తొలి మ్యాచ్ బంతి పడకుండానే మొదటి మ్యాచ్ తుడిచిపెట్టుకు పోయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ కాస్త.. రెండు మ్యాచ్‌లు సిరీస్‌గా మారింది. ఈ మ్యాచ్‌కు కూడా వర్ష సూచన ఉండటం అభిమానులతో పాటు రెండుజట్ల బోర్డులను కలవరపెడుతోంది. తొలి మ్యాచ్‌లా బంతి పడకుం డానే తుడిచిపెట్టుకుపోతుందా? కొన్ని ఓవర్ల ఆటైనా సాధ్యమవుతుందా? అనే ఆందోళన మొదలైంది. అయితే ఈ మ్యాచ్ బరిలోకి దిగే భారత తుది జట్టుపై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఓపెనర్‌గా రిషభ్ పంత్..

భవిష్యత్తు టీ20 ప్రపంచకప్‌కు ఇప్పుడే ప్రణాళికలు మొదలు పెట్టాలని, సరైన యువ ఆటగాళ్లను ఎంచుకోవాలని, టీమిండియా సారథిగా హార్దిక్ పాండ్యను నియమించాలనే డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ సిరీస్‌కు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. రిషభ్ పంత్‌ను ఓపెనర్‌గా ఆడించాలనే ప్రతిపాదనల నేపథ్యంలో అతని చేత ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయిస్తారా? అనేది చూడాలి.

ఉమ్రాన్, సిరాజ్‌లకు నో చాన్స్?

నాలుగో స్థానంలో సూర్యకుమార్ యాదవ్ ఆడనుండగా.. కెప్టెన్ హార్దిక్ పాండ్య ఆరో స్థానంలో ఫినిషర్ రోల్ పోషిస్తాడు. ఓపెనర్‌గా ఆడించకుంటే ఐదో స్థానంలో పంత్ ఆడతాడు. ఏడో స్థానంలో స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ ఆడనుండగా.. ఎనిమిదో స్థానంలో హర్షల్ పటేల్ బరిలోకి దిగనున్నాడు. హర్షల్ పటేల్ వద్దనుకుంటే అతని స్థానంలో సిరాజ్, ఉమ్రాన్ మాలిక్‌లలో ఒకరిని తీసుకోవచ్చు. పేస్ విభాగాన్ని భువనేశ్వర్ కుమార్ నడిపించడనుండగా..అర్ష్‌దీప్ సింగ్ అతనికి అసిస్టెంట్ వ్యవహరించనున్నాడు.

విశాలాంధ్ర గేమ్

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.